శ్రీకృష్ణ కర్ణామృతము - 51

పద్మాలు సూర్యకిరణ సంస్పర్శచేత అందముగా విచ్చుకుంటాయి. అరబిరుస్తూ ఉన్న ఆ పద్మ సౌందర్యమెంత అందమో శ్రీకృష్ణుని నేత్ర సౌందర్యమంత అందమే ~ విజయోత్సాహముతో స్వామి నవ్వ నవ్వు సాటి మరొకటి లేదు. గోపాంగనలతో ప్రణయకలహములో తన విజయాన్ని చాటే నవ్వు, ఆ నవ్వును ప్రదర్శించే కళ్ళు ~ ఆ చూపులుట్~ ఓహ్! అందులో మునిగి పో తు న్ నా ను కన్నయ్యా అని అంటున్నారు లీలాశుకులు:

**శ్లో: "అ హిమకర కర నికర మృదు మృదిత లక్ష్మీ**
**సరసతర సరసిరుహ సదృశ దృశి దేవే**
**వ్రజ యువతి రతి కలహ విజయి నిజ లీలా**
**మీద ముదిత వదన శశి మధురిమణి లీయే"**

భావము:

ఉదయసూర్యుని కిరణ కాంతుల మెత్తని స్పర్శతో ~ అంతకుముందుకంటే మరింత సొంపులొలుకుచున్న కళ్ళు కలవాడు ~ గోపాంగనల పొందులో ప్రణయ కలహములలో జయించి జయవిలాసాన్ని తోపించే చిరునవ్వు కలవాడు అయిన శ్రీకృష్ణుని ముఖచంద్ర మాధుర్యములో లీనమై పోవుచున్నాను.

అనువాద పద్యము:

**చ: " రతి కలహమ్ముననస్ సతుల రాయిడి జేసి జయించి మించు ను**
**ద్ధతి గనిపించు లేనగవు నందము గుల్కెడు మోము దమ్మిచే**
**నతుల విభాత భాను కిరణాప్తి వికస్వర భాస్వరాంబుజా**
**యత నయన ద్వయుంజెలగు నా మధురద్యుతి లీనమయ్యెదస్"**

వ్యాఖ్య:

అసలే సౌందర్యాలన్నీ నింపుకున్న కళ్ళు. లేత సూర్యుని కిరణాలు తాకితే మెత్తగ వికసించుకునే పద్మాలలాంటి కళ్ళు.అంత సౌందర్యమూర్తి కాబట్టే అడుగడుగునా ప్రణయకలహాలే ~ అన్ని పోరులలోనూ విజయము మాత్రము స్వామిదే ~ అందుకే ఆ ముఖకాంతులలో అంత తీయదనము. అ తీయని ప్రవాహములో మునిగిపోతున్నానంటారు కవి. "కన్నలే, అముదే" తేనే, పాలే అని నమ్మాళ్వారన్నట్లు భోగ్యభూతుడైన స్వామి రూపామృత ప్రవాహములో మునిగి పోవడము చాలా సహజము కదా!

**"మక్కువ వికసిత వదనలు ~ చక్కగ తనుగోల్వ హాస చంద్రిక తోడస్**
**మిక్కిలి నెరపెను కృష్ణుడు ~ చుక్కల గమినడిమి పూర్ణసోముని భంగిస్"**
అని అన్నారు పోతనామాత్యులు.

కృష్ణుడు అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది మురళీగానము. ఆ పెదవులు ~ వాటిపై దాగిన మనోహరమైన చిరునవ్వు. ఆ రూపమే లీలాశుకులను ఉక్కిరి బిక్కిరి చేసింది.

**శ్లో: కర కమల దర దళిత లలిత తర వంశీ**
**కల నినద దళ దమృత ఘున సరసి దేపే**
**సహజ రస భర భరిత దర హసిత వీధీ**
**సతత వహదధర మణి మధురి మణి లేయే'***

భావము:

చేతివ్రేళ్ళు తామర రేకులు ~ మిక్కిలి సొగసైన పిల్లన గ్రోవి మధుర ధ్వని నుండీ వచ్చు అమృతానికి బావిలాంటివాడు ~ సహజముగానే సభరితములైన చిరు నవ్వులకు సంచార వీధులైన అధరమణి మాధుర్యము గల శ్రీకృష్ణుని యందు లీనుడనై పోతున్నాను.

అనువాద పద్యము:

***"చ: లలిత కరాంగుళీదళ దళన్మురళీ మధుర స్వరామృతో**
**జ్జ్వల సరసిస్ మనోజ్ఞ సహజస్మిత కందళ చంద్ర చంద్రికా**
**వల దతుణాధరోష్ఠ మధువాసిత చారుముఖాంబుజంబునం**
**దొలగక నాదు మానస మధువ్రత మియ్యెడ లీనమయ్యెడిస్"***

వ్యాఖ్య:

మురళీ నాద శ్రవణానందములో భోజనం వద్దు ~ ఎలా ఉన్నామో పట్టదు ~ ఏ ధ్యాస లేదు ~ పరుగు పెట్టి శ్రీకృష్ణుని చేరడమే ~ నల్లనయ్యా ~ అంత మధురముగా మురళిని మ్రోగిస్తే ఆ ఆనందాన్ని ఈ శరీరము తట్టుకోగలదా!

"మ్రోయింపకో మురళి మ్రోయింపకో కృష్ణా ~ తేనెతేనియ బరువు మ్రోయలేదీ బ్రదుకు" అని అన్నారు దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు.

"కమలాకుచ చూచుక కుంకుమతో నియతారుణితా తులనీల తనో " అని అంటారు స్వామిని. లక్ష్మీస్తన కుంకుమతో ఎర్రబడిన నల్లనయ్య అని అర్థము.ఆ భావాన్నే ఈ శ్లోకములో లీలాశుకులు అందముగా ఆవిష్కరించినారు:

***"శ్లో: కుసుమ శర శర సమర కుపిత మదగోపీ**
**కుచ కలసి ఘుసృణ రస లసదురసి దేవే**
**మీద లులిత మృదు హసిత ముషిత శశి శోభా**
**ముహు రధిక ముఖ కమల మధురిమణిలీయే"***

భావము:

మదన క్రీడల యందు గోప వనితల స్తన కలశముల మీది పూతతో ప్రకాశించే వక్షస్థలము కలవాడునూ యౌవన విశేషముచే పుట్టి, చంద్రకాంతిని కూడా ఓడించు చిరునవ్వుచే మరింత ఎక్కువైన ఆనందము గల ముఖపద్మముచే చూడనొప్పు శ్రీకృష్ణునితో కలయ కోరెదను.

అనువాద పద్యము:

***""ఉ: పువ్వుల రువ్వగా నలుక బూనిన వల్లవ ధరల్**
**గ్రొవప్వున రవ్వమీర జనుగుత్తుల నొత్తిన కుంకుమంబెదస్**
**నివ్వటిలస్ శశాంకు జిగి నీటుల తేటల గొల్లలాడు లే**
**నవ్వుల గోము మోమున గనందగు నందకుమారు బొందెదస్"***

వ్యాఖ్య:

స్వామి శృంగార రసైకమూర్తి ప్రణయకేళిలో గొల్లెతలను ఆనందపరచే వేళ వారిపై పువ్వులు రువ్వాడట. ప్రణయకోపాన్ని అభినయిస్తూ వారు చేసిన పోరులో వారి కుంకుమ పూతలన్నీ అయ్యగారి వక్షస్థలానికి అంటాయట. కొత్త అందాలు చోటు చేసుకున్నాయి స్వామిలో. ముఖములో నవ్వులు పొంగినాయి. చందమామ అందాన్ని కూడా త్రోసిరాజనే సౌందర్యమూర్తి స్వామి.ఆ అందములో లీనం కాబోతున్నానంటారు కవి.

పోతనామాత్యులవారు గోపస్త్రీల ప్రశంసాపూర్వక క్రీడలనెంత మధురముగా రచించినారో ఈ సీస పద్యములో:

*" ఈ పొదరింటిలో ఇందాక కృష్ణుండు నాతోడ మన్మథ నటనమాడె
ఇయ్యెల మగుచోట ఇందాక చెపువుండు గాఢంబుగా నన్ను కౌగిలించె
ఈ మహీజము నీడ ఇందాక సుభగుండు చిట్టంబు చెయ్యివ్వల సిగ్గుగొనియె
ఈ పుష్పలత పొంత ఇందాక దయితుండు నను డాసి అధరపానంబు సేసె
ఈ ప్రసూన వేది ఇందాక రమణుండు కుసుమ దామములను కొప్పుతీర్చె
అనుచు కొందరతివలంభోజయనుని పూర్వలీల తలచి పొగడిరధిప"**"

కన్నయ్య పేరే "మధుః". తియ్యనివాడు. ఇంపుగా ఉన్నవాడు మరి కేళీ సమయములో కుంకుమాదులంటడములో వింతేమిటి?

వ్యాఖ్య:

శిశుత్వము చాలా మనోహరమైనది ~ శిశువులను ఎటుచూస్తే అటే అందము. నోరు విప్పితే అందము, నోరు మూస్తే ముడిస్తే అందము.అందాలన్నీ కలబోస్తేనే శిశుత్వము. సాక్షాత్ శ్రీమన్నారాయణుడే విభవమూర్తిగా శ్రీకృష్ణుడిగా వెలసిన అవతారములోని శైశవ దశ విషేషాన్ని చెప్పసాధ్యమా, అంటూ లీలాశుకులు ఆనంద తరంగితురులౌతున్నారీ శ్లోకములో:

***" ఆ నమ్రా మసితభ్రువే రుపచితా మక్షీణ పక్ష్మాంకురే**
**ష్వాలోల మనురాగిణో ర్నయనయో రార్ధ్రాం మృదౌ జల్పితే**
**ఆ తామ్రా మధరామృతే మదకలామమ్లాన వంశీరవే**
**ష్వాశాస్తే మమలోచనం వ్రజశిశోర్మ్మూర్తిం జగన్మోహినీమ్"***

భావము:

కన్నయ్య రూపము జగన్మోహనము. శరీరములో అణువణువునా అందము తోణకిసలాడుతూంటుంది కనుబొమలు కొంచము వంగి ఉన్నాయట. రెప్పల వెంద్రుకలు ఒత్తుగా ఒంపు తిరిగి ఉన్నాయట. దయామృతాన్ని వర్షించ కళ్ళు చంచలాలై కరిిగించేస్తున్నాయి. ఇంక చక్కని ముద్దు ముద్దు మాటలా మనసుని కరిిగించేస్తున్నాయి. అమృత స్వరూపమైన అధరము ఎర్రగా దొండపండులా ఉందట. నిత్యనూతనమైన వేణు గానామృతము పారవశ్యాన్ని కలిగిస్తోంది. లోకాలన్నంటిని ఆకర్షించే ఆ గొల్లపిల్లవాని దివ్యమంగళ విగ్రహాన్ని నా కళ్ళు సదా కోరుకుంటూంది ~ మంగళాశాసనాన్ని చేస్తోంది.

అనువాద పద్యము:

***"ఉ: కాంచుట యెన్న డీక్షణ సుఖంబుగ దొంగిలి రెప్పలుస్ బనా**
**యించిన వింటి బొమ లింపగు మాటలు కెంపుమోవి బొం**
**దించిన పిల్లనగ్రోవి బలికించు హళాహళియుస్ దయోన్నతిస్**
**మించిన బెళ్కుజూపు గల మిక్కిలి చక్కని ముద్దు బాలకుస్"***

వ్యాఖ్య:

ఆ కళ్ళు అటూ ఇటూ తిప్పుకుంటూ ఉంటే మన కళ్ళు కూడా వాటితోపాటే ప్రయాణము చేస్తున్నాయి ~ ఇంకా వచ్చీ రాని మాటలూ, ఊరీ ఊరని ఊరగాయిఅన్నట్లు చిలుకపలుకులు పలుకుతూ ఉంటే మనసెంత ఆనంద తరంగి ితమవుతుంది. చిన్న పెదవి ఎర్రగా కనిపిస్తూ ఆ పెదవిపై నాట్యము చేస్తూ వేణువు ~ ఆ వేణువుతో చిన్ని చిన్ని చేతుల నల్లనయ్య దివ్యరూపము వర్ణనాతీతము ~ తీయతేనియ బరువు మ్రోయలేదీ బ్రతుకు అన్నంత ఆనందము కలుగుతుంది.

**పోతనగారు ఇలా అన్నారు:**

**సీ: కన్నులు తెరవని కడు చిన్నపాపడై**
**దానవి చనుబాలు త్రాగి చంపె**
**మూడవ నెలనాడు ముద్దుల బాలుడై**
**కోపించి శకటంబు కూలదన్నె**
**ఏడాది కుర్రడై యెగసి తృణావర్తు**
**మెడ బట్టుకొని కూల్చి మృతుని జేసె**
**తల్లి వెన్నలకునై తనురోల కట్టిన**
**కొమతుడై మద్దుల కూలనీడ్చె**

**పసుల క్రేపుల గాచుచూ బకుని చీరె**

**వెలగతో వత్సదైత్యుని వేగగడపె**

**సబలుడై ఖరదైత్యుని సంహరించె**

**ఇతడు కేవల మనుజుడే ఎంచిచీడ"***

ఆ నెమలి పింఛము ~ ఆ గుంజా మాల

ఆ మురళీ నాదము ~ యశోదా నందనుని

బాల్యరూపము ముద్దులు మూటగట్టే రూపము

ఎప్పటికీ విరాజిల్లుతూనే ఉంటుంది ~~ అని అన్నారు సూరదాసు.

*శ్రీకృష్ణునిలో కనిపించే సౌందర్యము గానీ ప్రత్యంగ మనోహరత్వము గానీ ఏ ఇతర దేవతలలోనూ వెదకినా కనిపించదు. ఇది నిజము ~ నిజమంటూ నొక్కి చెబుతూ ఉన్నారు లీలాశుకులు ఈ శ్లోకములో:

***"తత్ కైశోరం తచ్చ వక్త్రార విందం ~ తత్ కారుణ్యం తేచలీలా కటాక్షాః**

**తత్ సౌందర్యం సాచమందస్మిత శ్రీః ~ సత్యం సత్యం దుర్లభం దైవతేషు"***

భావము

ముద్దులు మూటకట్టే ఆ శైశవము, పద్మములాంటి ఆ ముఖసౌందర్యము, ఆ దయాగుణము, ఆ సొగసు చూపులు, ఆ చిరునవ్వు సొబగు ~ ఓహ్! ఏమి అందము! ఏమి అందము! ఇది ఒక్క శ్రీకృష్ణునిలోనే కనిపిస్తుంది. ఇంక ఏ ఇతర దైవాలలోనూ కనిపించదు. ఈ మాట ముమ్మాటికీ నిజము.

అనువాదపద్యము

***"శా: ఆ కారుణ్య కటాక్ష వీక్షణము లాయందపు లేబ్రాయ మా**
**యాకారద్యుతి, యా దరస్మితము తీ రామోము చక్కదనం**
**బా కెంజాయ పదంబు లా నడల యొయ్యారంబు లే వేల్పులం**
**దే కాలంబున లేదు లేదనుచు నే నెందేని జాటించెదన్"***

వ్యాఖ్య

చిన్నారి కన్నయ్య ముగ్ధ స్వరూపం నాన్యతో దర్శనీయము. అరేరే! అదేమి అందము! అంత పసితనం! ముఖ శోభ! దయ! ~ మనసు దోచే చూపులు!~ ఆ నవ్వులజల్లులు ! ~ ఆ అందమంతా వెదకినా వేరుచోట కనిపించదు. ఇది మాటవరుసకు చెప్పే మాట కాదు ~ ముమ్మాటికీ నిజము ~ నిజము ~ అని అంటున్నారు లీలాశుకులు. ఏదైనా ఒక సత్యాన్ని నిరూపించవలసి వచ్చినపుడు పునరుక్తి ప్రయోగింపబడుతుంది. "సత్యం సత్యం పునః సత్యం యతిరాజో జగద్గురుః" అనే శ్లోకములో భగవద్రామానుజులకే గురువు అనే పదం సార్థకమని ~ ఆయనే జగద్గురువని చెప్పే సందర్భములో సత్యపదం మూడుసార్లు ప్రయోగింపబడింది. మన మనస్సు ఎక్కడెక్కడ తిరిగినా చివరికి ఆ స్వామి పాదాలమీద చేరవలదిందే ~ ఇది సత్యం.

** భగవంతునియందు భక్తి విశ్వాసాలున్నవారికి ఆ స్వామి నిశ్చింతతో కూడిన జీబితాన్ని ప్రసాదిస్తాడు. విశ్వాసమే శ్వాసగా జీవించాలి. "సమ్శయాత్మా వినశ్యతి"

అని అంటారు గీతలో. మన భారాన్ని స్వామి పాదాలపై మోపినపుడు ~"యోగక్షేమం వహామ్యహం" అని అన్నారు కన్నయ్య. అటువంటి తండ్రిని సదా ధ్యానించే లీలాశుకులు ఆయన బాల్యాన్ని మౌగ్ధ్యాన్ని మరువలేనంటూ దానినే దర్శించకోరుతున్నారీ శ్లోకములో:

*"విశ్వోపప్లవ శమనైక బద్ధ దీక్షం ~ విశ్వాస స్తబకిత చేతసాం జనానామ్
పశ్యామః ప్రతి నవకాంతి కందళార్ద్రమ్ ~ పశ్యామః పథి పథి శైశవం మురారేః"*

భావము:

తనపై భక్తి విశ్వాసములు కలవారికి సర్వోపద్రవములను నశింపచేసి మంగళము కూర్చుటకే దీక్ష బూనిదయూ, నిత్యనూతన కాంతితో నిండినదియు, ఆర్ద్రమైనదుయునగు శ్రీకృష్ణుని బాల్యమే నాకు ప్రతివీధి యందు కనిపించుగాక!

అనువాద పద్యము:

***"మ: నుత ధారాధర కాంతి కందళము కన్నుల్ చల్లజేయ సమ**
**గ్రత రాతంక పరంపరా శమన దీక్షన్ దేహము వజ్ర కా**
**యత గాంచన్ నెరనమ్మినట్టి ప్రజ కత్యానందమౌ దేవకీ**
**సుతు నొయ్యారపు బాలలీల గనవచ్చున్ నాదు దృగ్వీధులన్"***

వ్యాఖ్య:

శ్రీకృష్ణ పరమాత్మ గీతలో "అనన్యాశ్చింతయంతోమాం యే జనాః పర్యుపాసతే తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం" అన్నాడు. ఇతర ఫలాన్ని అపేక్షించకుండా అనన్య భక్తితో ఆయనే దైవమని నమ్మినవారి యోగక్షేమాలు తాను స్వయముగా వహిస్తాడట స్వామి. యోగమంటే కొత్త సంపదలు వచ్చి కలియుట; క్షేమమంటే దొరికిన సంపదలను జాగ్రత్తగా కాపాడుకొన గల్గుట. విశ్వాసం మూలముగా జీవితాన్ని గడిపితే ఆ స్వామి తప్పక రక్షిస్తాడు. విశ్వాసమే శ్వాస కావాలి.

* కన్నయ్య అదము వర్ణనాతీతము ~ ఆయనకే నెమలి పించము అలంకారము. ఆ శరీర కాంతి ~ నీలశోభ ~ నడుస్తుంటే జగగమనమా, వృషభగమనమా, సింహగమనమా, శార్దూలగమనమా ...ఒక్కొక్కసారి ఒక్కొక్క అందము. ఆ అందాలన్నీ కలబోదుకుని మధురాపురిలో తిరిగే ఈ బాలకుడెవరో అంటూ ఆశ్చర్యపోతున్నారు లీలాశుకులు~:

***"మౌళి శ్చంద్రక భూషణా మరకత స్తంభాభిరామం వపుః**
**వక్త్రం చిత్ర విముగ్ధ హాస మధురం బాలే విలోలే దృశౌ**
**వాచ శ్శైశవ శీతలా మదగజ శ్లాఘ్యా విలాసస్థితిః**
**మందం మందమయే క ఏష మధురావీధి మితో గాహతే"***

భావము:

ఓ చిన్నదానా! తలమీద నెమలి పురిని అలంకరించుకున్నాడు ~ శరీరము మరకతాలు పొదిగిన స్తంబములా ఉంది. ఆ నవ్వు ఎంత

ఆకర్షణీయముగా ఉందో, ఆ చూపులు చూస్తే చంచలాలు అమాయకుల మనసునే దోచు కుంటున్నాయి. మాటల్లో పసితనము ఉట్టిపడుతోంది. నిలిచిన పద్ధతి విలాసముగా ఉండి మదగజాన్నే తలపిస్తుంది. ఇదుగో ఇటునుండే మధురానగరం లోకి దూరుతున్నాడు. ఈ అందగాడెవడే?

అనువాద పద్యము:

***"ఉ:_మౌళితటిన్ ఘటించిన సమంచిత పింఛము, మందహాసమున్**
**లోల విశాల లోచనములుం జిరు నవ్వును ముద్దు మూటలున్**
**నీలపు డాలు నేలు మెయినిగ్గులు గల్గిన బాలుడెవ్వడో**
**వ్రాలెడు వీని జూడు మధురాపుర వీధుల బాటలాధరా!"***

వ్యాఖ్య:

కృష్ణునికే సొంతమనిపించే అలంకారము నెమలి ఈక. ఇంక శరీరమా ఇంద్రనీలమణి సన్నిభము ~ పచ్చరాకట్టు కంబంలా చూడముచ్చటగా ఉండే రూపము ~ ఆ నవ్వుకొక ప్రత్యేకత ~ ఆ నవ్వులో ఎనన్ని అర్థాలు దాగిఉంటాయో ఆ చూపులు తట్టుకోగలమా? చంచలాలాలై కవ్విస్తూ చూచే చూపులు, మాటలు అమాయకత్వము ఉట్టిపడుతూ ఎంత బాగుంటాయో! మీద గజ గమనములో ఒయ్యారాలన్నీ ఇక్కడికి వచ్చి దాగినాయో ఏమో? ఇంతటి అందగాడు ఇదుగో ఇటునుండే మధురాపురిలోకి ప్రవేశిస్తున్నాడు. అక్కడి యువతులొకరితో ఒకరు చెప్పుకుంటూ~" ఒ చిన్నదానా! ఈ అందగాడు ఎవరంటావు చెప్పు" అని ప్రశ్నిస్తున్నారు.

*భగవంతుణ్ణి పాదాల దగ్గరనుండీ సేవించాలని తమ దృష్టిని స్వామిపాదాలపై ప్రసరింపచేశారు లీలాశుకులు. అవి సామాన్య పాదాలా? తమ శోభతో పద్మాలను ఓడించడమే కాదు ~ లక్ష్మీ శోభ్యావంతములై ప్రకాశిస్తూన్నాయి. తేజస్సే ఒక శిశురూపాన్ని ధరించిందా? ఏమో! ఆ దివ్య సౌందర్యాన్ని ఎంత వర్ణించినా తృప్తి కలుగడములేదు అని అంటున్నారు లీలా శుకులు.

***"పాదౌ పాద వినిర్జితాంబుజవనౌ పద్మాలయా లంకతౌ**

**పాణీ వేణు వినోదన ప్రణయినౌ పర్యాప్త శిల్ప శ్రియౌ**

**బాహూదోహద భాజనం మృగదృశాం  మాధుర్య ధారాగిరో**

**వక్త్రం  వాగ్విభవాతి లంఘిత మహో! బాలం కిమేతన్మహః"***

భావము:

పాదములా తమ శోభాలేశము చేతనే కాదు తామరపూలని జయించి, లక్ష్మీ నివాసములయ్యాయి. మరి చేతులో! నిరంతరమూ వేణుగానము చేస్తూనే ఉన్నాయి. అనుకున్న పనిని సాధించగల శక్తువంతాలు, భుజములు కామినీ దోహద ప్రదములు. మాటలైతే తేనెధారలే ~ ఆ పలుకులలో అమాయకత్వము  ఉట్టి పడుతోంది. ముఖ శోభ మాటలకు అందరానిది. ఓహో! ఈ వెలుగు కేవలము బాల స్వరూపమా! ఎంతటి ఆశ్చర్యము!

అనువాద పద్యము:

***"చ: చెలువలకెల్ల దోహదము సేయు కరంబులు లచ్చి కాకరం**

**బులు జిత పద్మముల్ చరణముల్ మురళీ రచనా చమత్క్రియా**

**కలితము కేలుదమ్మి ముఖకాంతులు వింతలు తేనెలూరు మా**

**టలు గల యట్టి శైశవ విడంబన తేజమిదేమి చిత్రమో!**

వ్యాఖ్య:

కన్నయ్యను ఆపాదమస్తకమూ వర్ణిస్తూ మురిసి పోతున్నారు లీలాశుకులు. అవి పాదాలా! పద్మాలనే కాలదన్నే శోభతో విరాజిల్లుతూ కళ కళలాడిపోతున్నాయి. తన కాంతితో నాల్గవ వంతుతో పద్మాలను జయించిన పాదాలవి. అటువంటి వాటికి తామరపూలతో పోలిక హీనోపమానము కదా! పోలిక సమానమైన వాటి మధ్య అయితే బాగుంటుంది. ఇక చేతుల మాటచెప్పాలా. నేనెప్పుడూ నిన్ను అంటే ఉంటాననే పిల్లనగ్రోవిని ధరించి మధురాతి మధురముగా వేణుగానము చేస్తున్నాడు. "సంజగౌ వేణునా దేవకీ నందనః" అని చెప్పినట్లు లోకాలన్నింటినీ పరవశింపచేసే గాన మాధుర్యమది. భుజాలు కాలము కాని కాలములోనూ పుష్పింపచేసి ఫలింపచేసే దోహదాలుగా స్త్రీలను అన్ని వేళలా ఆకర్షించే మణిమయ స్తంబాలట! స్వామి పాదాలు లక్ష్మీ సంశోభితాలు. ఆ పాదాలలో శంఖ ~ చక్ర ~ కల్పన ~ ధ్వజ ~ అరవింద ~ అంకుశాదులు స్పష్టముగా కనిపిస్తుంటే చూచిన దేవతాకోటి ఇవి సామాన్య బాలుని పాదాలా అని చర్చించుకుంటున్నారాట!

ఏమయ్యా కన్నయ్యా! నీ అలంకారము చూస్తూ ఉంటే చాలా ఆశ్చర్యముగా ఉందయ్యా! ఆ నెమలి పురిని అలంకరించుకుంటే చాలా, ఇంకేమీ అవసరము లేదా? ఒకటి ...రెండు.. మూడు చుక్కలు బొట్లుగా పెట్టుకుంటే అందమా? ఏమి నాయనా! మందబుద్ధులము మేము ~ మాకు అందడము లేదు నీ సౌందర్యాధనం .. ఇదేదో చాలా చిత్రముగా ఉందే ~ అన్నారు లీలాశుకులు.

***"బర్హం  నామ విభూషణం బహుమతం వేషాయ శేషైరలం**
**వక్త్రం ద్విత్ర విశేష కాంతి లహరీ విన్యాస ధన్యాధరమ్**
**శీలై రల్పధియా మగమ్య విభవైః శృంగార భంగీమయం**
**చిత్రం చిత్రమహో విచిత్ర మహహో చిత్రం విచిత్రం మహః'***

భావము:

కన్నయ్యా! నీకు చాలా ఇష్టమైన నగ నెమలిపురియా? అలంకారానికి ఇంకేమీ అక్కరలేదా? నీ ముఖానికి అలంకారము రెండు మూడు చుక్కబొట్లా? ఆ అందముతో ఎర్రని మోవి మరింత అందముగా కనిలిస్తుంది. మందబుద్ధులకు అందని ఈ ప్రౌఢ విలాసాలు చూస్తే ఇవన్నీ శృంగార అలంకరణములా? చిత్రం! ఈ వెలుగు విచిత్రం.

అనువాద పద్యము:

***"ఉ: సొమ్ములు మేనికందమని చూడక పింఛమెపూని మోముపై**
**గమ్మని బొట్లు దింతరలుగా విలసిల్లగ గావి మోవి చె**
**ల్వమ్ము రసోత్తరంగ విభవమ్ము నగమ్యమునై తనర్చ జి**
**త్ర మ్మొక పాటి వారికి దరంబె నుతింప నొయారి తేజమున్"***

వ్యాఖ్య:

కన్నయ్యా! నీ సొగసుందనాన్ని సామాన్యులు అర్థము చేసుకోనూ లేరు ~ పొగడనూ లేరు. అది ఎంతో చిత్రముగా ఉంది ~ ఎలాగంటే నీకు అలంకరించుకోవడానికి ఏ నగలూ అక్కరలేదా? ఒక్క నెమలి పింఛముంటే చాలా? అది ఏమి అదృష్టము చేదుకుందయ్యా! అలాగే నీ ముఖము మీద మూడు నాలుగు చుక్కల కస్తూరి బొట్టు  నీ ముఖము కాంతిని పదింతలు పెంచుతుందా! ఎర్రని పెదవులే ఆశలు పెట్టని ఆభరణములటగా! ఏమో తండ్రీ ~ మావంటి మంద బుద్ధులకు ఆ అలంకారాలు ~ అవి పెట్టుకునే తీరులు ఏం తెలుస్తాయి చెప్పు. నీది అంతా చిత్ర విచిత్రమైన అలంకారం! నీ తేజోరూపం ~ దాని సౌందర్యము ఎవరు వర్ణించగలరు? వేదాలే నిన్ను వర్ణిద్దామని బయలుదేరి వెనుదిరిగాయట! ఇంక మానవులకు అంత శక్తి ఎక్కడిది? హే సౌందర్యాధి దేవతా! శ్రీకృష్ణా నీకు ఇదే మా వందనం.

** కన్నయ్య అల్లరి కమనీయము ~ తాను ఆడుతూ అందరినీ ఆటపట్టిస్తూంటాడు.  గోపికలు తమతో ఆడుతూ ఉన్నవాడు అంతలో మాయమైపోతే తట్టుకోలేక పోయారు.  వారితో దోబూచులాడే కన్నయ్య చేసే అల్లరిని వర్ణించారీ శ్లోకములో:

*"అగ్రే సమగ్రయతి కామపికేళి లక్ష్మీం ~ అన్యాసు దిక్ష్వపి విలోచనమేవ సాక్షీ
హా! హన్త! హన్త!  హన్త! మమ దూర మహోకిమేతత్ ఆసీత్ కిశోరమయమంబ  జగత్త్రయం మే!"*

భావము:

నా కన్నుల ఎదురుగా ఆడుతూ కనిపిస్తున్నాడు ~ చేతులు చాస్తే దొరకడే! అదే సమయములో అన్ని దిక్కులలోనూ అలాగే ఆడుతూ కనిపి ిస్తున్నాడు. కానీ చేతికందడే!  దీనికి నా కళ్ళే సాక్షి. అయ్యయ్యో ఇదెక్కడి వింతమ్మా! ఈ జగత్తు అంతా నాకు గోపబాలమయముగా కనిపిస్తుంది.

అనువాద పద్యము:

***"చూడం  జూడ మనోహరాకృతి కడుం జోద్యంబుగా బాలకుం**
**డాడున్ ముందట గౌగిలింతునని డాయం జిక్క డారీతినే**
**క్రీడించున్ దిశలందు నిందులకు నక్షిద్వంద్వమే సాక్షియీ**
**జూడన్ ముజ్జగమంబ! బాలమయ మాశ్చర్యంబు నాకెంతయున్"***

వ్యాఖ్య:

మా నల్లనయ్యను చూ చారా ~ ఆ కన్నుల అందాన్ని దర్శించారా! తలపై నెమలి ఈక ~ ఆ దొంగ నవ్వులు ~ మా మనస్సులనే దోచేసాడు. మీ పొదలమాటున దాగి ఉన్నాడా ~ అంటూ ముగ్ధ భక్తితో అడుగు తున్నారు గోపికలు చెట్టు చెట్టునూ కొమ్మ కొమ్మనూ ~ అంటూ ~ "నల్లనివాడు పద్మ నయనంబులవాడు...." ఈ పద్యము మనకందరికీ తెలుసు కదా!

తమ మనోవీధిలో అనుక్షణమూ దర్శనమిచ్చే స్వామి తమ ఎదుట కనపడాలని తహ తహ పడుతున్నారు లీలాశుకులు.

***"చికురం బహుళం విరళం భ్రమరం, మృదులం వచనం విపులం నయనం**
**అధరం మధురం వదనం లలితమ్, చపలం చరితన్ను కదా నుభవే"***

భావము:

కన్నయ్య జుట్టు ఒత్తుగా ఉంటుంది ~ ముంగురులు పిల్లగాలికే నాట్యమాడే టంత పలుచగా ఉంటాయి. మాట మెత్తగా ఉంటుంది. కళ్ళనూ మోవినీ వర్ణింప సాధ్యమా! ముఖసౌందర్యము చంద్రుణ్ణే త్రోసిరాజంటుంది.

అనువాద పద్యము:

**.*"ఉ: వెన్నెల గోపకాంతలను వేడుక గోరెడి చాపలంబుతో**
**గన్నుల బెళ్కుతో నగుమొగంబున వ్రాలు చలాలకాళితో**
**దిన్నని పల్కుతో ముడిచి దిద్దిన గొప్ప శిరోజపాళితో**
**నెన్నడు నాదు మ్రోల జరియించునొ వెన్నుడు కావిమోవితోన్"***

వ్యాఖ్య:

"యధాకప్యాసం పుండరీకమేవ మక్షిణీ" అని అన్నట్లు నేత్ర సౌందర్యము అపురూపము. కన్నయ్య పెదవిలోని ఒయ్యారాలు, మాధుర్యాలు ఆయంస్ వేణువుకూ  గోపాంగనలకూ మాత్రమే తెలుస్తాయి. "మధురాధిపతే రఖిలం మధురం" అని ఆయనేమి చేసినా అందమే ~ అలాంటి అందాలరాశిని నేనెప్పుడు చూస్తాను, అనుభవిస్తాను అని ఆతృతతో ఎదురు చూస్తూ ఉంటానన్నారు.

శ్రీ పరాశరభట్టర్ తమ శ్రీ రంగస్థవములో ~~కదాహం  కావేరీ తటపరిసరే రంగనగరే ~ .....దివసాన్ అని అన్నారు కదా!

* కన్నయ్యా! నన్ను రక్షించు అని మొరపెడితే వింటావా? ఎప్పుడూ వేణువూదుకుంటూ గోపికలతో ఆడుతూ ఉంటావుకదా? ఆ వేణువు ధ్వని మధ్య నా మొర నీకు ఎలా వినిపిస్తుంది? ఎప్పుడు నా మొర వింటావో మరి అని అంటున్నారు లీలాశుకులు:

***"పరిపాలయ నః కృపాల యేతి ~ అసకృజ్జల్పిత మాత్మ బాంధవః**
**మురళీ మృదుల స్వనాన్తరే ~ విభురాకర్ణయితా కదానునః"***

భావము:

వేణుగాన పరవశుడై ఉన్నాడు కన్నయ్య ~ నేను ఆర్తితో ~ తండ్రీ! నన్ను రక్షించు ~ అని ఎన్నో సార్లు నేను పెట్టిన మొరలను ఎప్పుడు వింటావో?

అనువాద పద్యము:

***"చ: నిరుపమ వేణుగాన మహనీయ సుఖానుభవైక మగ్నతం**
**గరగి పరాకుగైకొనిన కంజదళాక్షుడు తృప్త చిత్తుడై**
**నిరతము నన్ను గావు నవనీత హరాయని మాటి మాటికిన్**
**మొరయిడునట్టి నా వచనముల్ దయతో నెలుడాలకించునో"***

వ్యాఖ్య:

నీవే దిక్కని నమ్మి నీవే సర్వస్వమని నమ్మినవారు ఎప్పుడూ నిన్నే ప్రార్థిస్తూ ఉండాలి. స్వామీ నన్ను దయ చూడు అని ఒకటి రెండు సార్లు కాదు,

అనేక పర్యాయాలు శరణాగతి చేస్తూ ఆత్మ సమర్పణ భావముతో ప్రార్థిస్తూ ఉంటే ఎప్పుడైనా ఒకసారి వింటాడేమో ~ మరి ఆ వేణుగానము మధ్యలో ఆయన ఎన్నటికి వింటాడో?

సకృత్ దేవ ప్రపన్నాయ తవాస్మీతి చయాచతే ఆభయం సర్వభూతేభ్యో దదామ్యే తత్ వ్రతమ్ మమ అని అన్నాడు స్వామి ~ నేను నీ వాడిని అని శరణాగతి చేస్తే చాలు ఆర్తితో ~ నీవు ఆదుకుంటావే ~ ఎన్ని సార్లు పిలుస్తున్నానో తెలుసా ~ నీ ఆనందము, నీ వేణుగానము ~ నీ గొడవ నీదేనా? నిజమే.. ఆ మురళి కనిపిస్తే చాలు ...ఇంకెవరూ కనిపించరు ..వినిపించరు.

రక్షింపకపోతే ఏమిటయ్యా నీ బంధుత్వం? దీనుల కుయ్యాలింపను, దీనుల రక్షింప, మేలు దీవనపొందన్ దీనావన నీ కొప్పును, దీనపరాధీన దేవదేవ మహేశా...నిరతము నన్ను గావు నవనీతహరా ~ ఇదే దీనుల గోడు. నీ దయ రాదా...కాదనువారెవరూ? అని అన్నారు త్యాగయ్య స్వామి.

ద్రౌపది దీనాలాపాలు విని ఎన్ని మార్లు రక్షింపలేదు స్వామి! నా మొరాలకించి నన్ను రక్షించు .. అనే ఆర్ద్రహృదయము చేసే నాదము స్వామికి తప్పక వినిపిస్తుంది.

*ఈ సంసారములో అడుగడుగునా కష్టాలే. కష్టమొస్తేనే ఆ భగవంతుడు గుర్తుకు వస్తాడు ~ నన్ను ఎంధుకు ఇలా బాధిస్తున్నావు ~ ఎప్పుడు కరుణిస్తావు?అనిఅంటాము. ఆయనను దర్శిస్తే ఆనందము ~ ఆయనకు దూరము కావడమే దుఃఖం.

***"కదాను కస్యాంను విపద్దశాయాం ~కైశోర గంధిః కరుణాంబుదిర్నః**

**విలోచనాభ్యాం విపులాయతాభ్యాం ~ వ్యాలోకయిష్యస్ విషయీ కరోతి"***

భావము: దయాసముద్రుడైన ఈ గోపాలబాలుడు తన విశాల నేత్రాలతో నన్ను ఎపుడు అనుగ్రహిస్తాడో?

అనువాద పద్యము:

***"చ: ఒక వలవంత చింతిలుచు నుండెడి నన్ను శిశుత్వగంధ మం**

**త్ర కలిత యౌవనంబు దనరం గరుణావరుణాలయుండు వా**

**యక శతఫత్త్రపత్ర విపులారుణ లోచనలీల జూచు చూ**

**డ్కి కి దగు వీడటంచు! బరికించుట లెన్నడు గల్గనేర్చునో"***

వ్యాఖ్య: కన్నయ్య దివ్య కటాక్షము మనమీద ప్రసరించాలి. ఆపదలలో ఆ స్వామి వెన్నంటి ఉండాలి. తండ్రీ నిన్ను మేము సేవింపని కాలమే మాకు మహాపాతక సమయం.

*సౌందర్యమంటే మనకు గుర్తుకొచ్చేది మన్మధుడు. "మాం మధ్నాతి ఇతి మన్మథః"~ ఈ కన్నయ్య అందము నన్ను కూడా మధించివేస్తూందే అని అనుకున్నాడట మన్మధుడు. కన్నయ్య అందము ఆ పాద శిరః పర్యంతమూ అణువణువులో దాగి ఉందన్నుంటున్నారు లీలాశుకులు.

**మధుర మధర బింబే మంజులం మందహాసే**

**శిశిర మమృత వాక్యే శీతలం దృష్టిపాతే**

**విపుల మరుణనేత్రే విశృతం వేణునాదే**

**మరకత మణినీలం బాల మాలోకయేను**

భావము:

పెదవి యందు మాధుర్యాన్ని నింపుకున్నవాడు~ మందహాసముతో మంజులమూర్తి ~ మాటలలో శిశిర మూర్తి ~ దృష్టి ప్రసారములో చల్లనివాడు ~ అరుణ నయనాలలో విశాలమూర్తి ~ వేణువూదడములో ఆరితేరినవాడు ~ మరకతమణి వంటి కాంతిగల నల్లనయ్యను ఎప్పటికైనా చూడగలనా!

అనువాద పద్యము:

**చల్లని టెక్కు జూపు సుధ జల్లెడు దియ్యమోవియున్**
**సల్లలితారుణద్యుతి విశాల విలోచనముల్ మృదుస్మితో**
**త్పుల్ల ముఖాంబుజంబు బరిపూరిత వేణు వినోదనాదమున్**
**నల్లని మేను క్రొమ్మెరుగునన్ విలసిల్లిన బాలుగాంచెదన్**

వ్యాఖ్య:

ఎప్పుడు చూస్తాను అనే ఆర్తి బయలుదేరిందంటే ఇంక క్షణమొక యుగముగా అనిపిస్తుంది. సౌందర్యరాశియైన కన్నయ్యను తలచుకోగానే ఎప్పుడు చూస్తానో ~ కనిపిస్తే పలుకరించాడా ~ తేనెలు కురిపించడమే ~ ఎన్నటికి ఆస్వాదిస్తానో అని అనుకున్నారు లీలాశుకులు. మరకతమణి వర్ణుని ఎన్నడు దర్శిస్తాను అని తల్లడిల్లిపోతున్నారు.

చిన్నారి కన్నయ్య అందము నా మనస్సును ఎత్తుకొనిపోతోంది ~ నేనేమి చేయనని మురిసి పోతున్నారు లీలాశుకులు.

**శ్లో: మాధుర్యాదపి ~ మధురం ~ మన్మధ తాతస్య కిిమపికైశోరమ్**

**చాపల్యాదపి చపలం ~ చేతో మమ హరతి హంత! కింకుర్మః**

భావము ~ శ్రీకృష్ణుడు మన్మధ జనకుడు ~ ఆయన బాల్యం అందం కంటే అందమైనది. ఇంక నా మనస్సా చాపల్యము కంటె చపలమైనది. ఆ అందము ఈ మనస్సును దొంగిలించుకుని పోతోంది ~ నేనేమి చేయగలను?

మాధుర్యమంటే మధురాష్టకములో ~

గీతం మధురం పీతం మధురం ~ భుక్తం మధురం

రూపం మధురం తిలకం మధురం ~ మధురాధిపతే రఖిలం మధురం

అని అన్నారు కదా! ఆ మాధుర్యమే ఈ నా మనస్సును ఆకర్షించి లాక్కొనిపోతోంది అని కవి చమత్కారముగా అన్నారు. మనస్సు నపుంసకము కదా! ఆకర్షణలకు లోనుకాదులే అని ధైర్యముగా ఆ మనస్సును రాయబారము పంపారట. నపుంసక మితిజ్ఞాత్వా ~ ప్రియాయై ప్రేషితం మనః తత్తు తత్రైవ రమతే హతాః పాణినినా వయమ్ తీరా చూస్తే ఈ మనస్సు కూడా ఆయనయందే లగ్నమయిపోయింది. పంపినవారే ఆయన దరిజేరిపోతే నా గోడు ఎలా వివరించేది? అయ్యో! ఈ మనస్సు అనే శబ్ధము నపుంసకముగా ఉంటూ ఎంత అన్యాయము చేసిందిఅని చమత్కరిస్తున్నారు కవి.

ఒక అందాన్ని గురించి విన్నపుడు, ఆ అందాన్ని ఎప్పుడు చూస్తామా అనే తహ తహ ఒకటి కలుగుతుంది. శ్రీకృష్ణ సౌందర్యాన్ని విన్నపుడు లీలాశుకులకు అటువంటి ఉత్సుకత బయలుదేరింది.

**శ్లో: వక్షః స్థలేచ విపులం  నయనోత్పలే  చ**

**~   మందస్మితేచ మృదులం మదజల్పితే చ**

**బింబాధరే చ మధురం మురళీరవే చ**

***   బాలం విలాస నిధి మాకలయే కదాను**

భావము

వక్షస్థలము, కన్నుల విషయంలో విశాలమైనవాడునూ, చిరునవ్వులో మోహవాక్కులలొ మృదువైనవాడునూ, పెదవి, పిల్లనగ్రోవి మ్రోతలతో మధురాతి మధురమైన వాడునూ, చక్కదనాల చుక్క అయిన చిన్నారి కన్నయ్యను నేనెప్పుడు చూస్తానో?

అనువాద పద్యము

**బళిరా కన్నులబెళ్కు రొమ్ముజిగి చెప్పన్ రాదు వేణుధ్వనుల్**

**దలమా యెంచగ గాలి మోవిరుచి వింతల్ దేటలేనవ్వు ని**

**గ్గులు మజ్జారె సుధా మనోహర మృదూక్తుల్ మాయురే యిట్టి యొ**

**ప్పుల కుప్పం దిలకించు భాగ్య మహిమంబుల్ మాకునింకెన్నడో**

వ్యాఖ్య

కన్నయ్య దివ్య సౌందర్యాన్ని గురించి తెలియనంతవరకే మనస్సు స్థిమితముగా ఉంటుంది... తెలిసిన తరువాత ఆ రూపాన్ని చూడకుండా ఉండలేదీ మనస్సు.. కన్నయ్య వక్షస్థలం, గుండెలు  ఆ నేత్రాలెంత విశాలముగా ఉన్నాయో! చిరునవ్వు, వాక్కు రెండూ కూడా మృధుమధురంగా

ఉంటాయట! అందాలగని ఆ చిన్ని పాపడు. అటువంటి కన్నయ్యను ఎప్పుడు చూస్తానో కదా అనే ఆతృత భక్తవరేణ్యులకు కలిగే కోరికే కదా! విలాసాలకు నిధి కన్నయ్య ~ ఆ ఒప్పులకుప్ప ఏమి చేసినా ~ ఏ పలుకులు పలికినా ఆనందమే

కన్నయ్య పరమ పురుషుడు ~ ఆయనను దర్శించాలంటే అనేక జన్మలలో ఆర్జించిన పుణ్యం మాత్రమే సాధనమవుతుంది. పుణ్యమూర్తులు మాత్రమే ఆయన దర్శన భాగ్యానికి నోచుకుంటారు అని అంటున్నారు లీలాశుకులు. ఆర్ద్రావలోకిత దయా పరిణద్ధ నేత్రమ్ ~ ఆవిష్కృత స్మిత సుధా మధురాధ రోష్టం ఆద్యం పుమాంస మవతంసిత బర్హి బర్హమ్ ~ ఆలోకయంతి కృతినః కృత పుణ్య పుంజాః

భావము

దయతో చల్లనైన విశాలములైన నేత్రములు కలవాడును, పెదవులపై అమృతహాసము చిందించువాడును, నెమలిపురిని సిగ బంతిగా అలంకరించు కున్నవాడును, పురాణ పురుషుడును అగు శ్రీకృష్ణుని అనేక జన్మలలో ఆర్జించిన పుణ్యములు గల ధన్యులు మాత్రమే చూచుచున్నారు.

అనువాద పద్యము

**అందము చిందు మోము దరహాస సుధా మధురాధరోష్ట మ**
**స్పంద దయావలోకన విశాల విలోచనముల్ శిరంబునం**
**బొందుగ నెమ్మి పింఛమును బూనిన యాద్యుని దేవదేవునిస్**
**నందకుమారు గాంతురు సనాతన పుణ్యమునస్ బుధోత్తముల్**

వ్యాఖ్య

భగవంతుడెవరికి కనిపిస్తాడంటే పుణ్యమూర్తులకు ~ ఏదో ఒక జన్మ పుణ్యము చాలదు. జన్మ. జన్మల పుణ్యముండాలి. ఆయన అలాంటివారికి కనిపిస్తే చిరునవ్వులు చిందిస్తూ ~ తలపై నెమలి పురిని సర్దుకుంటూ కనిపిస్తాడు.

క్రియతే ఇతి కృతినః - స్వామి అనుగ్రహ కారణముగా భక్తులు ధన్యులౌరారు.

పునాతీతి పుణ్యః - పాపులను కూడా పాపదూరులను చేసి పవిత్రీకరిస్తాడు.

శాస్త్రానుసారము నడవడమే పుణ్యం చెసుకోవడం. అలా చేయకపోవడమే పాపము మూటగట్టుకోవడం. గొల్లపిల్లలు కృష్ణుడు తృణావర్తుని చంపిన తరువాత ~

**గత జన్మంబుల నేమి నోచితిమొ యాగశ్రేణులే మేమి చే**
**సితిమో! ఎవ్వరికేమి పెట్టితిమొ ఏ చింతారతిం బ్రొద్దు పు**
**చ్చితిమో! సత్యములేమి పల్కితిమొ ఏ సిద్ధ ప్రదేశంబు ద్రొ**
**క్కితిమో ఇప్పుడు సూడగంటి మిచటం కృష్ణార్భకుస్ నిర్భయుస్**

అని అన్నారు పోతన గారు భాగవతములో.

అత్యంత మనోహరాకారముతో స్వామి లీలాశుకుల మనోనేత్రానికి కనిపించినాడు. స్వామీ...ఏమి నీ అందము? అందాలకే మూలపురుషుడివా అంటూ ఆ రూపాన్ని ప్రశ్నిస్తున్నాడు.

**శ్లో: మారః స్వయంను మధుర ద్యుతి మండలంను**

**మాధుర్య మేవను మనోనయనామృతంను**

**వాణీమృజాను మమ జీవిత వల్లభోను**

**బాలోయ మభ్యుదయతే మమ లోచనాయ**

భావము

నా కళ్ళకు కనిపించుచున్న ఈ బాలుడు మన్మధుడా? చంద్రుడా? మూర్తీభవించిన సౌందర్యమా? నా మనస్సు యొక్క ఆనందమా? నా కళ్ళకు పండుగా? నా వాక్కును పరిశుద్ధి చేయు వస్తువా? నా ప్రాణవల్లభుడా? ఎవరో? అత్యంత మనోహరాకారుడై కనిపించుచున్నాడు.

అనువాద పద్యము

**ఉ: మారుడో కాక యంబుధి కుమారుడొ మానస లోచనామృతా**

**కారమొ! మాధురీ గుణవికారమొ! మంజుల వాక్ చమత్క్రియా**

**సారమొ నాదు జీవ మణిసారమొ లేక మరేమి చిత్రమో**

**మారెడు బాల భావమున మెచ్చులు గుల్కెడు నాదు చూడ్కికిన్**

వ్యాఖ్య

చిన్ని కన్నయ్యను దర్శించినపుడు కలిగిన ఆనందము వర్ణణాతీతము. ఏమిటి మన్మధుడే ఇలా వచ్చాడేమో అనిపిస్తుంది ఆ రూప సౌందర్యము. చంద్రుని చుట్టూ ఉండే కాంతి వలయమేమో అని అనిపిస్తుంది. మనస్సు ~ కళ్ళు కూడా అమృతాస్వాదనము చేసినంత ఆనందాన్ని పొందుతాయి. నా

వాక్కులను శుద్ధి చేసే వస్తువేమో అనే పవిత్రత కనిపిస్తుంది ఒకసారి. కాదు కాదు నా ప్రాణవల్లభుడే అనిపిస్తుంది.... చివరిగా .... ఇలా ఆనంద పర్యవస్యాన్ని కలిగించే ఆ రూపాన్ని ఎంత వర్ణిస్తే తనివి తీరుతుంది!
కన్నయ్య రూపము నయనాందాన్ని కలిగించే రూపము అ కళ్ళు త్రిప్పుకోవడమూ, ఆ దిక్కులు చూడడమూ, ఆ గొల్లవేషమూ ~ అబ్బో ....కళ్ళకు విందే!

**శ్లో: బాలోయ మాలోల విలోచనేన ~ వక్త్రేణ చిత్రీకృత దిఙ్ముఖేన**
**వేషేణ ఘోషోచిత భూషణేన ~ ముగ్ధేన దుగ్ధే నయనోత్సుకం నః**

భావము

~ ఈ చిన్ని కృష్ణుడు కళ్ళు అటూ ఇటూ త్రిప్పుకుంటూ తన ముఖ కాంతులతో నిలిచి గొల్లపల్లెకు తగిన అలంకారాన్ని ధరించి ఆ వేషములో నా కన్నుల పండుగ చేస్తూ ఉన్నాడు.

అనువాద పద్యము

**ఎల్లెడ చిత్రరూపము వహించిన చక్కని దమ్మితో**
**గొల్ల విలాస వేషమునకుం దగు సొమ్ములతోడ బల్పయో**
**జోల్లస దక్షి శీతల సమున్నతిలో విలసిల్లు బాలకుం**
**దుల్లము పల్లవింప నయనోత్సవమార జరించుటెన్నడో**

వ్యాఖ్య

కళ్ళు తిప్పుకుంటూ మాట్లాడడం బాల్యచేష్టలలో ఒక అందమైన చేష్ట. పిల్లలు అలా తిప్పుకుంటూ మాట్లాడుతూంటే చూడడానికి ఎంతో బాగుంటుంది. సామాన్యుల విషయములోనే అలా అనుకుంటే సాక్షాత్ మన్మథ మన్మథుడైన కన్నయ్య అందము విషయం వేరే చెప్పాలా... ఆయన ఎటుచూస్తే అటు ఆ దిక్కుకే అందం వస్తోంది...అందునా గోపవేషమాయె...ఆ నెమలి ఈకపురి..ఇదొక అందమే! గొల్లవాడు పాలను పిండినట్లుగా ఈ గొల్లపిల్లవాడు కన్నుల ఉబలాటపు బరువును పిండుతున్నాడట! ఇదొక మధురమైన ఊహ...మధురాధిపతే అఖిలం మధురం...ముఖకాంతులతో దిక్కులనందగింప చేయడమేమిటంటే ఈయన నల్లని ముఖమే దిగంగనకు కస్తూరీ తిలకమైనదట...ఎంత అందమైన భావం వెలువరించారు కవీంద్రులు!

అందుకే వ్యాసరాయలు కన్నయ్యను తొందరగా రమ్మని పిలుస్తూ ....
కృష్ణా నీ బేగనే బారో ~ బేగనే బారో ముఖవన్నె తోరో
అని పాటను కన్నడ భాషలో రచించినారు. కన్నయ్య దివ్యముఖమండల కాంతిలోని ఆకర్షణ అలాంటిది.

అమృత పదార్థమొకటి దగ్గర చేరుతోంది. ఏమిటా రసాయనము...లోచన రసాయనము ...నేత్రామృతము...అదుగో ఎంత అందంగా వచ్చేస్తుందో...చూచిన కొద్దీ అందులో అందాలు స్పష్టమబుతున్నాయి ...పరవశింపచేస్తునన్నాయి.

**ఆందోళి తాగ్ర భుజ మాకులానేత్ర లీలం ~ఆర్ద్ర స్మితార్ద్ర వదనాంబుజ చంద్రబింబమ్**
**శింజాన భూషణశతం శిఖిపించి మౌళిం ~ శీతం విలోచన రసాయన మభ్యుపైతి**

భావము ~

నయనామృతం శ్రీకృష్ణుడు... అయన దగ్గరగా వస్తున్నాడు..ఎలాగో తెలుసా? భుజాలు ఎగురవేసుకుంటూ కళ్ళు త్రిప్పుకుంటూ...మందహాసాలు చిందిస్తూ తన ఒంటిపై ప్రకాశించే నగలను గలగలలాడిస్తూ మువ్వలు మ్రోగిస్తూ తలపై నెమలి పింఛాన్ని సరిచేసుకుంటూ ....ఓహో...ఏమి అందం! అలా వచ్చే రూపము కన్నులకు అమృతము కదా!

అనువాదపద్యము

**అందెలు మువ్వలుస్ మొరయ హస్తము బాపగ గంకణ ధ్వనుల్**
**సందడి సేయ నానన విలాసము చందురు గ్రేణిసేయ నా**
**నందవిశాల లోల నయనమ్ములతో శిఖిపించమౌళితో**
**నందముజెందు లోచన రసాయన మల్లదె వచ్చె చల్లగస్**

వ్యాఖ్య

ఇష్టమైనవారి దర్శనము అమృతముగా అనిపిస్తుంది. కన్నయ్య కనిపిస్తున్నాడంటే ఆ నయనామృతాన్ని ఎంత చూస్తే తనివి తీరుతుంది. ఎదో రావడము కాదు..భుజాలెగురవేస్తూ రావడం ఊహించండి...ఎంత ముద్దు! ఆ కళ్ళు త్రిప్పుకోవడం...ఎంత ఆనందం! మధ్యలో నవ్వుల పలకరింపు ఎద పులకరింపే...ఇదుగో నేనొస్తున్నా అన్నట్లు...ఆ

గాజులు, మువ్వలు, పట్టీలు అన్నీ చేతుల్తో కదిపి గలగల లాడిస్తూ వస్తున్నాడు.. ఎంతచూస్తే తనివి తీరుతుంది! విలోచన రసాయనమట! నేత్రాలకు అమృతమే కన్నయ్య! అదితి వామనుణ్ణి చూచి ఆ అందానికి ముగ్ధురాలై....

అదే

నన్ను కన్న తండ్రి నాపాలి దైవమ ~ నా తపః ఫలంబ నా కుమార

నాదు చిన్నివడుగ నా కులదీపిక ~ రాగదయ్య భాగ్యరాశివగుచు

అని అంటుంది.

గొల్లపిల్లల గోష్టికి పెట్టని నగ కన్నయ్య. ఆయన గోష్టికే ఒక అలంకారము. ఆయన నవ్వే ఆయనకు ఒక అలంకారము. ఆ అందగాడే లీలాశుకుల మనస్సులో ప్రవేశిస్తున్నాడు.

**పశుపాల బాల పరిషద్ విభూషణం ~ శిశురేష శీతల విలోల లోచన మృదుల**

**స్మితార్ద్ర వదనేందు సంపదా ~ మదయస్ మదీయ హృదయం విగాహతే**

భావము

ఈ బుడుతడు గొల్లవారి సభలకు అలంకారమైన వాడు. ఆ బెళుకు చూపులు, ఆ మందహాసము, చంద్రునివంటి ఆ ముఖ కాంతి ~ అబ్బా! నా హృదయములో లోలోపలికి ప్రవేశిస్తున్నాడు.

అనువాద పద్యము

**చ:  వికవిక నవ్వుచుస్ నుదుట ప్రేలుకురుల్ నును పాలబుగ్గలుం**
**జికిలి మెరుంగుచూపు రహిజెందగ నానన శీతల ద్యుతిం**
**బ్రకటిత గోప శాబక సభానన భూషణ  మై చెలంగు బా**
**లకుడు మదీయ మానస తలంబున నిల్చెను సొంపు నించుచుస్**

వ్యాఖ్య   ~

~ ఒక గోష్టికే ఆభరణముగా నిలవాలి అంటే ఆ వ్యక్తిలో ఎన్ని ప్రత్యేకమైన విలక్షణమైన లక్షణాలు ఉండాలి! కన్నయ్య గొల్లల గుంపులకే అలంకారమట! ఆ ఒక్కడు లేకపోతే ఆ గోష్టి నిస్సారమే ఔతుంది. ఆ ఒక్కనితో ఎక్కడ లేని కళ వస్తుంది. అతడు ప్రాణము అతడుంటేనే  వారికందరికీ అందము. అతడే  వారికి ఆభరణం. అతనివల్లనే ఆ గోష్టికి అందం, ఆనందం.అదీ కన్నయ్య వైభవం.

కులశేఖరాళ్వార్లు తమ ముకుందమాలలో ఇలా అన్నారు:

**ధ్యాయంతియే విష్ణుమనంత మవ్యయమ్**
**హృత్ పద్మ మధ్యే సతతం వ్యవస్థితం**
**మదీయ హృదయం విగాహతే** ~~ నా మనస్సులో చొచ్చుకొని పోతున్నాడు అనే దానికి పెద్దల అనుభవాలెన్ని నిదర్శనాలో కదా!

ఒక నల్లని తేజస్సు కళ్ళముందు కదలాడుతూ ఉంది. చీకటికి రూపమొచ్చినట్లుంది. ఆ కాంతి ఊహకే దొరికే అనుభూతి అది.

**శ్లో: తదిదముపనతం తమాలనీలం ~ తరళ విలోచన తారకాభిరామమ్**

**ముదిత ముదిత వక్త్ర చంద్రబింబం ~ ముఖరిత వేణు విలాస జీవితమ్**

భావము

~ చీకటి కానుగు చెట్టువలె నల్లనైనదుయు, కనుపాపల కదలికతో రమ్యమైనదియు, మిక్కిలి ఆనందపూర్ణమైన చంద్రునివంటి ముఖము కలదియు తీయగా మ్రోగుచున్న వేణుగానమునకు ప్రాణభూతమైనదియునగు ఈ కాంతిపుంజము నన్ను చేరుచున్నది.

అనువాదపద్యము

**ఉ: నీల ఘనాభమయ్యు నతి నిర్మల వేణు నినాదజీవమై**
**లోల తటిల్లతా లలిత లోచన తారకమై ప్రసన్నతో**
**ద్వేల ముఖేందు మండల నవీన విలాస కలాకలాపమై**
**బాలుని లీల వచ్చి కనిపట్టె మహాద్భుత తేజమయ్యెడన్**

వ్యాఖ్య

కానుగ చెట్లు నల్లగా ఉంటాయి. కన్నయ్య శరీర కాంతి ఆ చెట్టు కాంతితో పోటీ పడుతూందట! అంత నలుపేమిటో! అది నలుపు కాదు, లోపల దాగిన కరుణ ~ ఎంత చూపినా ఇంతింతలుగా పెరిగే దయాగుణము. సముద్రములో నీరు తరగనట్లే స్వామిలో దయ తరగదు. ఇంక కంటిపాపలా...అవి తారకలు..మిల మిలా మెరిసి పోతూంటాయి. అనిర్వచనీయ ఆనందాన్నిస్తాయి. ఇంక ముఖచంద్రునిలో నవ్వులు వెన్నెలలు ఉబికి ఉబికి వస్తుంటాయి. దాచినా దాగని నవ్వుల కాంతులవి. ఆ నవ్వుల మధ్య

మురళీగానామృతము. ఇటు కళ్ళకు, అటు చెవులకు ఒకటే ఆనందాన్నిచ్చే అ నల్లని కాంతి....అదుగో..ఇదుగో... ఏట నావైపే వచ్చేస్తోంది...ఆహ్ ఏమి ఆనందము!

పోతన కూడా ఇలా అన్నారు వారి శ్రీమద్భాగవతములో ~

**ప: తల్లుల చన్నుబాలు మునుత్రావు తరిస్ తమ కర్ణవీధులస్**
**వల్లభమైన మాధవుని వంశరవా మృత ధార నొచ్చునం**
**త్రుళ్ళక పాలురా తివక దూటక మానక కృష్ణుమీద దృ**
**గ్వల్లులు నేర్చి నిల్చినవి వత్సము లంగనలార కంటిరే**

తమ తల్లులతో పాటు వత్సములు తాము బొమ్మలవలె నిలిచిన దివ్యానుభూతి ఇది.

**శ్లో;చాపల్యసీమ చపలానుభవైక సీమ**
**__చాతుర్య సీమ చతురానన శిల్పసీమ**
**__సౌరభ్య సీమ సకలాద్భుత కేళి సీమ**
**సౌభాగ్య సీమ తదిదం వ్రజభాగ్య సీమ**

భావము ~

చాంచల్యమునకు హద్దుగా నిలిచినది, లక్ష్మి దేవి యొక్క అనుభవమునకు ముఖ్యమగు స్థానమైనదీ, జాణతనమునకు నెలవైనదీ, బ్రహ్మయొక్క నిర్మాణ వైభవమునకు హద్దుగా నిలిచినది, పరిమళమునకు స్థానమైనది దాతృత్వానికి హద్దుగా నిలిచినదీ, సౌందర్యానికి నిధియైనదగు ఆ శ్రీకృష్ణ తేజము ఇదుగో కళ్ళముందే ఉంది ఈ వ్రజభాగ్య సీమలో.

అనువాద పద్యము

**చ: కలిమినెలంత వేడుకలకందువ, పంట విలోల వృత్తికిన్**

**నెలవు, కుభాళి కాస్పదము నేర్పుల ప్రో వజశిల్పి కల్పనా**

**ఫల మతి చిత్రలీలలకు బాళెము తావులకెల్ల దావు గో**

**కుల జన భాగ్యసీమ యిదిగో! కనుగొంటిని గంటి కింపుగన్**

వ్యాఖ్య ~~ చాపల్యానికి హద్దట! అల్లరి అనే మాటకు కృష్ణుడే హద్దు. లక్ష్మీదేవి శ్రీమన్నారాయణుని గుండెలపై కొలువుతీరి ఒక క్షణమైనా ఉండజాలనని అగలగిల్లేన్ అని నమ్మాళ్వార్లు ప్రసాదించినట్లు కొలువుదీరిన అనుభవైక సీమ. ఇంక జాణతనమనేది కన్నయ్యనుంచే బయలుదేరి ఉంటుంది లోకములోకి.... బ్రహ్మగారి సృష్టికే పరాకాష్టగా నిలిచిన తత్త్వము ~ అంటే చరాచర జగత్తుకు మూలకారకుడైన స్వామి బ్రహ్మసృష్టిలో తానూ ఒకనిగా నిలిచాడు. తన సృష్టిలో పరమాత్మను చూచి ఇది నా నేర్పరితనానికి పరాకాష్ట అని అనందముతో తలమునకలయ్యాడు బ్రహ్మ. పరిమళాలకే తావు స్వామి అని ఒక అర్థము. సురభికి దానగుణము సహజ లక్షణము. అలాగే స్వామికి ఇయ్యడమే ధర్మంగా మెలసినవాడు. కాబట్టీ దాతృత్వానికి పరాకాష్ట ~ అదే సురభి భావ సౌరభ్యము. అధ్భుతాలన్నీ అక్కడనుండే పుట్టాయి. అదృష్టాలన్నీ అక్కడే చోటుచేసుకున్నాయి. అన్ని మాటలెందుకు? ఈ కృష్ణతేజము ~ వ్రజసౌభాగ్యసీమ ~ గొల్లవారి పుణ్యఫలమే కన్నయ్య కదా!

కళ్ళకు అగుపించే అ సౌందర్యాన్ని చూస్తే అడుగడునా అశ్చర్యమే. అమందానంద కందళిత హృదయారవిందులయ్యారు లీలాశుకులు.

**శ్లో: మాధుర్యేణ ద్విగుణ శిశిరం వక్త్రచంద్రం వహంతీ**

**వంశీ వీధీ విగళదమృత స్రోతసా సేచ్ఛయంతీ**

**మద్వాణీనాం విహరణ పదం మత్త సౌభాగ్య భాజాం**

**మత్పుణ్యానాం పరిణతి రహో! నేత్రయోస్సనిధత్తే**

భావము

తాపాన్ని పోగొట్టే మాధుర్య గుణముచేత మరింత చల్లనైన ముఖచంద్రుడు గలది, పిల్లనగ్రోవి నాదముతో వెలువడే అమృత ప్రవాహముతో ముల్లోకముకములను తడుపునది, నా మాటలకు క్రీడాస్థానమయినది, మదించిన సంపదలతో కూడిన నా పుణ్యములకు పంటాయినది అయిన వస్తువు నా కళ్ళముందు కదలాడుచున్నది.

అనువాదపద్యము

**చ: లావణ్యాంబుధి చంద్రబింబ ముఖలీలం దాల్చి వంశీ నినా**

**దావిర్భూత సుధాప్రవాహమున నోలాడం బ్రవర్తిల్లు నా**

**దైవాకారము నావచో విహరణ స్థానంబు న పుణ్య స**

**ద్భావం బార బ్రసన్నమయ్యెను యశోదా పుత్ర రూపంబునన్**

వ్యాఖ్య

కన్నయ్య ముఖం చంద్రబింబములా దర్శనీయముగా ఉండి తాపాన్ని పోగొడుతుంది. మాధుర్యము ~ సౌందర్యమనే గుణాలు ఆ ముఖములో నిండివుండడము వల్ల మనలోని తాపమంతా తుడిచి పెట్టుకు

పోతుంది. వేణు గానామృతముతో రసప్లాదితమవుతాయి. ఈ దివ్య దర్శనము నన్ను పరవశింపచేస్తుంది. పోతనామాత్యుడు ఎలా వర్ణించారో ~

**గిరులెల్ల జలములయ్యెం ~ దరులెల్లను పల్లవించె ధరణి గగన భూ**
**చరులెల్లను జొక్కిరి హరి ~ మురళి రవామృతమునోక ముద్దియగంటే**

*రాధా వల్లభుడే కాదు, గోపికా వల్లభుడు కూడా శ్రీకృష్ణుడు. ఆనాటి ఋషులు శ్రీమన్నారాయణుని రూపాన్ని మోహించి పరవశిస్తే, తాను శ్రీకృష్ణుడనై అవతరించినపుడు మీరంతా గోపవనితలై మీకు వల్లభుడనౌతాని మాట ఇచ్చాడు. అప్పటి ఋషులే ఈ గోపాంగనలు.

**ధేనుపాల దయితా స్తనస్థలీ ధన్యకుంకుమ సనాథ కాన్త యే**
**వేణుగీత గతి మూల వేధసే తేజసే తదిదమోం నమోనమః**

భావము ~ గొల్లకాపరుల ఇల్లాండ్రయొక్క చనుగొండలయందలి కృతార్థమైన కుంకుమ ద్రవముతో సహితమైన నీలకాంతిగల బ్రహ్మగీతము యొక్క పిల్లనగ్రోవి పాటల నటునకు ప్రసారమునకు మూల్స్ బ్రహ్మమైనదీ అగు వెలుతురుకొరకు ఆ ఈ ప్రణవ పూర్వ నమస్కారము.

అనువాదపద్యము

**మ: పసిగాపుం జిగురాకుబోండ్ల మెరుగుం బాలిండ్ల కాశ్మీరపు**
**ద్రసముల్ జొబ్బిలి నుబ్బి నిర్భర పరారంభ స్థితిందెల్పు ను**
**ల్లసితంబై మురళీ నినాదగతి మూల బ్రహ్మమై కంటి కిం**
**పొసగం జాలెడు మూర్తికిస్ మొగుడు గీలోంకార పూర్వంబుగస్**

వ్యాఖ్య ~

"కరపైగళ్ పిన్ శెన్రు" అని ఆండాళ్ తల్లి చెప్పినట్లు మేమూ వాటివెనుకే అడవికి పోయేవాళ్ళము. వాటికున్నంత జ్ఞానము కూడా మాకు లేదని అంటారు గోపికలు. తేజోమండలమూర్తిగా వెలిగే స్వామికి ప్రణవపూర్వక నమస్కారము అని అంటున్నారు లీలాశుకులు.

పోతన వారి భాగవతములో ~

వనిత నేడు కృష్ణు వంశనినాదంబు ~ విని పయోధరంబు విరులు కురిసి
తన శరీరమెల్ల ధవళాత పత్రంబు ~ చేసి మిన్న నీడ చేసెకంటె

మేఘము విరుల వాన కురియడము ~ శ్వేతచ్ఛత్రముగా మారడము మురళీ గాన మహిమే కదా!

శ్రీకృష్ణ తేజము ఇటు లీలావిభూతిని, అటు నిత్యవిభూతినీ ఏక కాలములో ~పరవశింప చేసే వైశిష్ట్యము కలది అని అంటున్నారు లీలాశుకులు.

**శ్లో: తేజసేస్తు నమో ధేనుపాలినే లోకపాలినే**
**రాధా పయోధరోత్సఙ్గ శాయినే శేషశాయినే**

భావము ~

గోవులను కాచునదియు, జగములను బ్రోచునదియు, రాధాదేవి హృదయముపై శయనించునదియు, ఆదిశేషునిపై పవ్వళించునదుయునగు కృష్ణుడను పేరు కల వెలుగుకు నమస్కరిస్తున్నాను.

అనువాదపద్యము

**ఉ: పయని భక్తి మ్రొక్కెద నపార కృపారస ధేనుసౌఖ్య సం**
**ధాయికి లోకరక్షణ విధాయికి భాసుర రాధికా కుచ**
**స్థాయికి బన్నగాధిప విశాల ఫణామణిసౌధ వీధికా**
**శాయికి గోపికా నయన సార ఫలప్రదాయికిన్**

వ్యాఖ్య

ఇంత చిన్న శ్లోకములో చిన్న పదాలతో వచ్చినదిది. బ్రహ్మకు తండ్రియట, యశోదకు పుత్రుడట ~ ఎలా చెప్పాలి ఆయన వైభవాన్ని అని అన్నారు అన్నమా చార్యులు గారు. ఎత్తిరం అంటూ నమ్మాళ్వార్ ఆ సౌలభ్యాన్ని తలచుకుని ఆరు మాసాలు మూర్ఛపోయారట! అంతటి మహనీయుడు గోవులను కాచే గోపాలకుడిగా ఎలా ఉన్నాడు? అన్నమయ్య ~ పరమపురుషుడట పశులగాచెనట ~ అని అన్నారు ~ ఆ గోవులకు ముద్దు పేర్లు పెట్టాడట!
పోతన ఎలా అన్నారో చూద్దామా?

**రా పూర్ణచంద్రిక రా గౌతమీ గంగ రమ్ము భగీరథ రాజతనయ**
**రా సుధా జలరాశి రా మేఘమాలిక రమ్ము చింతామణి రమ్ము సురభి**
**రా మనోహారిణి రా సర్వమంగళ రా భారతీదేవి రా ధరిత్రి**
**రాశ్రీమహాలక్ష్మి రా మందమారుతి రమ్ము మందాకిని రా శుభాంగి**

ఈ పేర్లెలా ప్రేమను కురిపిస్తున్నాయో కదా!

కన్నయ్య తత్త్వాన్ని తలచుకుంటే మనసు పరవశిస్తుంది. ఆ తత్త్వము బాలుడి రూపములో నా కంటికి కనిపిస్తే ఆ ఆనందమే అనుభవైకవేద్యము.

**మృదు క్వణన్నూపుర మన్థరేణ ~ బాలేన పాదాంబుజ పల్లవేన**

**అనుక్వణన్మంజుల వేణు గీతం ~ ఆయాతి మే జీవిత మాత్తకేళి**

భావము ~ ఆడుకొనుటకై నా ప్రాణం నా జీవిత సర్వస్వమూ నా కన్నయ్య మెల్ల మెల్లగా నడచి వస్తున్నాడు ~ కాలి అందియలు ఘల్లు ఘల్లుమని మ్రోగుతున్నాయి. లేతపాదాలు ముద్దు ముద్దుగా చిందులు వేస్తున్నాయి. వాటికి అనుకూలముగా పిల్లనగ్రోవిని ఊదుతూ అదుగో ఇట్టే వస్తోంది నా ప్రాణము.

అనువాద పద్యము

**చల్లని వేణుగీతి కనుసారిగ దాళగతుల్ సెలంగ గల్**

**గల్లు రటంచు నందియలు గజ్జలు నొక్కట బిక్కటిల్లగా**

**బల్లవ కోమలాంఘ్రులను బాలకుడాడుచుబాడుచుండ నా**

**వేల్లిత వృత్తి వచ్చె గనువిందుగ జీవము వచ్చుకైవడిన్**

వ్యాఖ్య ~

అందెల మ్రోత...చిందులేసే పాదాలు ...విందుచేసే వేణుగానం...

పోతన ~ **క్రమమొప్పన్ నదులెల్ల వంశరవ మాకర్ణించి సంజాత మో**

**హములన్ మన్మథ సాయకక్షత విశాలావర్తలై హంస వా**

**క్యము లంజీరి తరంగ హస్తముల నాకర్షించి పద్మాపహా**

**రములం కృష్ణ పదార్చనంబు సపిపెన్ రామా విలోకించితే**

ఇంకా ~~ **శ్రీకృష్ణా! యదుభూషణా! వరద! రాశీభూత మాధుర్యమా**

**శోక ప్రావృతలోక రక్షణ పరా! శుద్ధాత్మ, గోలోక పా**

**లా, కారుణ్య మహోదధీ సరస లీలామానుషా కార తం**

**డ్రీ! కాపాడర! నీ పదాంబుజ యుగమ్మే నమ్మి యున్నానురా!**

ఇంకా ~ **నూపుర కంకణ కింకణ కరతల మంజుల మురలీ**

**తాల మృదంగ్ ఉపంగ్ చంగ్ ఏక్ హి సుర జరలీ** అని అన్నారు సూరదాసు.

కన్నయ్య స్వామి నావైపే వస్తున్నాడు. అతని వేణుగానమాధుర్యముతో నా చెవులను నింపేస్తున్నాడు. ఆ చూపులలో ఎంత తళుకు! ఎంత విలాసము! ఆనందాన్నంతా నింపుకున్న చూపులవి ~ ఆ చూపులలో నా చూపులు లగ్నమై ఎంత ఆనందాన్ని ఇస్తున్నాయో అని అంటున్నారు లీలాశుకులు.

**శ్లో: సోయం విలాస మురలీ నినదామృతేన**

**సించన్నుదంచిత మిదం మమ కర్ణయుగ్మం**

**ఆయాతి మే నయన బంధు రనన్యబంధుః**

**ఆనంద కందళిత కేళి కటాక్ష లక్షః**

భావము

క్రీగంటి చూపులు లక్షలు లక్షలుగా ప్రసరిస్తున్నాయి స్వామి కళ్ళనుండీ. ఎంత విలాసవంతమైన చూపులవి ~ ఆయన నా నయన బంధువు. రిక్కించి ఉన్న నా చెవులకు తన వేణుగాన అమృతముతో నింపుతూ తడుపుతూ ఇదుగో వచ్చేస్తున్నాడు.

అనువాద పద్యము

**మాలిమిజేసి గోపికల మానము గాచినవాడు వీడె కా**

**బోలును నేడు వేణురవముం జెవి నింపుచు నాదు కంటికిన్**

**మేలలరం బ్రమోద రసనిర్భర కేళి కటాక్షలక్షుడై**

**బాలు డనన్య బంధుడెడ బాయక యిట్లలయింప వచ్చెగా**

వ్యాఖ్య

మురళీగానము కన్నయ్యకు ప్రాణము ~ అ గాన స్వరాలతో ఆయన కటాక్షాలు కూడా పోటీపడ్డాయి. చూపుల ప్రవాహము గాన ప్రవాహాన్ని కలుపుకుని వినేవారి చెవులలో నాదాన్ని మదిలో మోదాన్ని నింపుతూ వస్తోంది.

పోతన గారెంత అనుభవించారో ఈ పద్యాన్ని చూడండి:

వనితా! కృష్ణుడు నల్లని ~ ఘనమనియున్ వేణురవము గర్జనమనియున్

మనమున తలంచి రొప్పిచు ~ నన వరతము నెమలి తుటుములాడెడి కంటే!

కృష్ణుడు ఒక మేఘమట! వేణుగానము ఒక గర్జనమట! అ మేఘాన్ని చూచి ఆ గర్జన విని నెమలి ఆనంద నాట్యం చేసిందట! ఆ ఆనందమే అయన తలపై ఎక్కి కూర్చునేలా చేసిందట!

కన్నయ్య నడకలలో ఎన్నో ఒయ్యారాలో ~ ఒకసారి సింహ శార్దూలముల వలె నడిచి మరొక్క సారి గజమనిడై విలాసాలు ఒలికిస్తాడు.

**శ్లో: దూరా ద్విలోలయతి వారణ ఖేలగామీ**

**ధారా కటాక్ష భరితేన విలోచనేన**

**ఆరాదుపైతి హృదయంగమ వేణునాద**

**వేణీదుఘేన దశనావరణేన దేవః**

భావము ~ ఏనుగువలె విలాసమువలె నడచు కన్నయ్య ఎడతెగని ధారవంటి క్రీగంటి చూపులతో నిండిన కన్నుదోయిచేత దూరమునుండీ చూచుచున్నాడు. హృదయమునకు ఆహ్లాదాన్ని కలిగించు వేణువు స్రోతల ప్రవాహములను పిండుచున్న వాతెరతో పెదవితో దగ్గరగా చేరుచున్నాడు.

అనువాద పద్యము

**మ: ఘన మత్తేభ విలాస యానము నెలంగస్ దవ్వులంజూచి చ**

**ల్లని ధారాళ కటాక్ష వీక్షణ సముల్లాసంబుతో జెంగటస్**

**ను వేళం దశన చ్ఛదంబు వెలయుస్ నా స్వామి సమ్మోద మో**

**హన వంశీ నినద ప్రవాహముఖ లీలావాప్తి దెల్పుందయస్**

వ్యాఖ్య ~~ లక్ష్మణుని అన్నతో వనవాసానికి పంపిస్తూ తల్లి సుమిత్ర ~

**శ్లో: సృష్టస్త్వం వనవాసాయ ~ అనురక్తః సుహృజ్జనే**

**రామే ప్రమాదం మాకర్షీః ~ వత్స! భ్రాతరి గచ్ఛతి** అని అంటుంది.

అన్నకు ఎలాంటి అపాయము రానీకు ~ రామే ప్రమాదం మా కర్షీః శ్రీరామ గమన సౌందర్యములో మునిగిపోకు అని అంటుంది కుమారునితో.

పోతనామాత్యుడు భాగవతములో ~~

**నళినోదరు భక్తునిగని ~ కులజులు నందాశ్రు జలము కురియు పగిది ప్రా**
**కులు పూదేనియ లొలికెడు ~ నలినాక్షుని చేతి వంశనాళము ప్రీతన్**

అని అన్నారు.

**శ్లో: త్రిభువన సేరసభ్యాం దీప్తభూషాపదాభ్యాం**
**దృశి దృశి శిశిరాభ్యాం దివ్య లీలాకులాభ్యాం**
**అశరణ శరణాభ్యాం అద్భుతాభ్యాం పదాభ్యాం**
**అయమయ మనుకూజత్ వేణురాయాతి దేవః**

భావము

ముల్లోకాలకూ ఆనందాన్ని కలిగించునవియు ప్రకాశించుచున్న వెలుగులకు నెలవైనవియూ, ప్రతిదృష్టియందునూ చల్లనైనవియు అత్యద్భుత విలాసములచే ఒప్పియున్నవియు, దిక్కు లేని వారికి దిక్కైనవియు, ఆశ్చర్యకరమైన చరణములచేత గమన లీలలను అనుసరించి ఊదబడిన పిల్లన గ్రోవి కల ఆనంద స్వరూపిడైన స్వామి ఇడుగిడుగో మెల్లగా వస్తున్నాడు.

అనువాదపద్యము

**చ: క్రీడాభూషణధారులై తశరణ శ్రేయ శ్శరణ్యంబులై**
**చూడం చూడగ జల్లనై సొగసునై చోద్యంబులై దేవతా**
**చూడా రత్నములైన పాదముల రా సొంపొంది వేణుధ్వనుల్**
**జూడల్ దెల్పగ వీడెవీడె యన నా స్వామిన్ విలోకించెదన్**

వ్యాఖ్య

ఈ శ్లోకములో స్వామివారి శ్రీపాద వర్ణన చేయబడింది. కన్నయ్య పాదాలి దివ్య చిహ్నాలని ఆళవందారు గారు ఒక శ్లోకాన్ని మనకందించారు:

కదా పునశ్శంఖ రథాంగ కల్పక ~ ధ్వజార విందాం కుశ వజ్రలాంచితం
త్రివిక్రమ త్వత్ చరణాంబుజ ద్వయం ~ మదీన మూర్ధాన మలం కరిష్యతి

శంఖం చక్రం  కల్పకం ధ్వజం పద్మం అంకుశం వజ్రముల గుర్తులతో నిండిన నీ దివ్యపాదాలు ఎప్పుడు నా శిరస్సును అలంకరిస్తాయో అని అంటారు. ఎన్ని అధ్భుతాలు చేసిచూపిన పాదాలో అవి!. శ్రీరామావతారములో పాదాగ్రముతో దుంధుభి కాయాన్ని ఎత్తి పడేయలేదూ! శ్రీకృష్ణావతారములో శకటాసురాది  రాక్షస సంహారాన్ని చేసిన శ్రీపాదాలివేగా! ఇలా ఎన్నని చెప్పాలి? అంత గొప్ప పాదాలు వేణుగానానికి అనుగుణముగా కదులుతూ నాకు దగ్గర అవుతున్నాయికదా ~ ఎంతటి అదృష్టము నాది ~ అని లీలాశుకుల ఆనంద భావన?

*కన్నయ్య అనగానే మనకు గుర్తుకొచ్చేది వెన్న దొంగనే కదా! అబ్బో ఎన్ని దొంగతనాలు చేసాడో చూడండి అంటున్నారు లీలాశుకులీ శ్లోకములో:

**సోయం మునీంద్ర జన మానస తాప హారీ**
**సోయం మీద వ్రజ వధూ వసనాప హారీ**
**సోయం తృతీయ భువనేశ్వర దర్ప హారీ**
**సోయం  మదీయ హృదయాంబురు హోప హారీ**

భావము ~ యోగి జనుల మనో తాపాన్ని దొంగిలించిన వాడు ఇతడే! గొల్లెతల చీరలు దొంగిలించినదీ ఇతడే కదా! ఇంద్రుని యొక్క కాళీయుని యొక్క గర్వభంగ మొనర్చిన వాడు కూడా ఇతడే కదా! వీడే నా మనస్సును కూడా దోచుకునిపోయిన దొంగ ఇన్నాళ్ళకు దొరికినాడు!

అనువాద పద్యము

**చిక్కెర నాడు గోపికల చేలము లెత్తిన దొంగ, శైలముల్**
**చెక్కులు సేయు వాని మదజృంభము నాచిన దొంగ భక్తి చే**
**నొక్కను మౌనికోటి మది నిల్చిన తాపము బాలి దొంగ నా**
**చొక్కపు జిత్త సారసము జారలుగా గొను దొంగ నేటికిస్**

వ్యాఖ్య ~ అన్నమయ్య తన సంకీర్తనలో ఒక సారి :

**గురు తెరిగిన దొంగ కూ గూ గూ వీడే ~ గుడిలోనె దాగీని కూ గూ గూ**
**నెలతల దోచీని నీళ్ళాడ గానే ~ కొలని దరిని దొంగ కూ గూ గూ**
**కొలని దరిని దొంగ కూ గూ గూ ~ బలువైన ఉట్ల పాలారగించీని**
**బలిపైన ఉట్ల పాలారగించిని ~ కొలఫి మీరిన దొంగ కూ గూ గూ**

ఇక పోతనామాత్యుడు ఎలా అనుభవించాడో ఈ పద్యాన్ని చూడండి:

**ఇంతుల్ తోయము లాడుచుండ మగవారే తెంతురే వచ్చిరా**
**ఇంతల్ సేయుదురే కృపా రహితులై ఏ లోకమందైైన నీ**
**వింతల్ నీ తల పుట్టిగాక మరి ఏవీ కృష్ణ యోచెల్ల నీ**
**చెంతస్ దాసులమై చరించెదము మా చేలంబు లిప్పింపవే**

ఇంద్ర గర్వాపహరణములో ఇంద్రుడంటాడు:

**ఒక్కొక్క లోకము కాచుచు ~ ఎక్కుడు గర్వమున ఏమె ఈశుల మనుచుం**

**చొక్కి నను బోటి వెర్రులు ~ నిక్కము నీ మహిమ తెలియనేర రనంతా!**

గోవిందపట్టాభిషేకాన్ని చేస్తాడు ఇంద్రుడు ~ సురభి క్షీరాన్నిచ్చింది. ఐరావతము గంగాజలాన్నిచ్చింది. ఈ దొంగ నేర్పరితనానికి మురిసిపోనివారు ఎవ్వరు?

**శ్లో: సర్వజ్ఞ త్వేచ మౌగ్ధ్యేచ సార్వ భౌమ మిదం మమ**

**నిర్వశన్నయనం తేజో నిర్వాణ పద మశ్నుతే**

స్వామి సర్వజ్ఞుడు ~ అటువంటి స్వామిని చూచినపుడు కలిగే ఆనందము మోక్షానందమేనట! సర్వజ్ఞత్వమునందు జగన్మోహన ముగ్ధ భావమునందు సాటిలేని ఈ తేజోరాశి శ్రీకృష్ణుని చూచి నా కన్ను మోక్షానందమి పొందుచుచున్నది.

అనువాద పద్యము

**మ: విను సర్వజ్ఞత యందు మౌగ్ధ్యమున నుర్విన్ సార్వభౌమంబు నా**

**ను నీ తేజమి జూచి నా నయనముల్ సారూప్యముంజెందె వీ**

**దని యా లోకము జేయగా భ్రమర కీట న్యాయముంగాంచెగా**

**దన జ్ఞానేంద్రియ రూఢి కన్నులకు నేలాగల్గు నూహింపగన్**

వ్యాఖ్య

సామూహిక న్యాయంగా తెలియడం సర్వజ్ఞత్వము. ప్రతిదానిని గూర్చి విడి విడిగా తెలియడము సర్వవిదిత్వము. ఇంత తెలిసిన స్వామికి ఏమీ తెలియని వానిలా ముగ్ధునిగా కనిపించడము ఎంత విశేషము! అందుకే పోతన ~~ వేదాంత వీదుల విహరించు విన్నాణి విహరించు కాంతార వీధులందు అని ఆశ్చర్యాన్ని వెలిబుచ్చారు.

అనువాదపద్యములో కవి భ్రమరకీట న్యాయాన్ని ప్రయోగించినారు. భ్రమించగా భ్రమించగా ... ఆ శబ్ద శ్రవణ శక్తితో ఆ కీటకము కూడా భ్రమరముగా అంటే తుమ్మెదగా మారుతుంది. అదే ఆన్యాయం అలాగే పరమాత్మ తేజస్సునుచూచి చూచి కవి కళ్ళు సారూప్యాన్ని పొందాయట! అంటే సర్వజ్ఞ త్వాన్ని గ్రహించి జ్ఞానేంద్రియాలయ్యాయట!

వాక్~ పాణి ~ పాద ~ పాయు ~ ఉపస్తలను కర్మేంద్రియాలంటారు.

త్వక్ ~ చక్షు~ శ్రోత్ర ~ జిహ్వ ~ ఘ్రాణాలని జ్ఞానేంద్రియాలంటారు.

అందులో చక్షువులు జ్ఞానేంద్రియాలు కావడానికి కారణం జ్ఞానరూపుడైన స్వామిని చూడడమే అని చమత్కరిస్తున్నారు కవి.

సారూప్యము ~ సాలోక్యము~ సామీప్యము ~ సాయుజ్యము ~ అని మోక్షము నాలుగు విధాలు.

నిర్వాణ పదాన్ని అందముగా దర్శింపజేసారు లీలాశుకులు. మోక్షమంటే మహానందమే కదా! ఎంత అందము ~ ఎంత అందగాడు ఈ జగన్మోహన సౌందర్యముతో లోకాన్ని పరవశింపచేసాడు స్వామి!

*చంద్ర దర్శనము చేత సముద్రము ఉప్పొంగుతుంది. శ్రీకృష్ణ చంద్ర దర్శనము వల్ల లీలాశుకుల మనస్సనే సముద్రము ఉప్పొంగింది.

**శ్లో: కృష్ణాన మేతత్ పునరుక్త శోభమ్ ~ ఉష్ణేత రాంశో రుదయం ముఖేన్దోః**

**తృష్ణాబు రాశిం ద్విగుణీ కరోతి ~ కృష్ణాహ్వాయం కించన జీవితం మే**

భావము ~

ఈ శ్రీకృష్ణుడు అనే వస్తువు నా ప్రాణము ~ నా జీవితము ~ తన ముఖచంద్రునిచేత పూర్ణిమ చంద్రునికి కూడా వన్నె పెడుతూ నా ఆశా సముద్రమును మరింత పొంగిపొరల చేస్తున్నాడు. చంద్రుని చూచి సముద్రము పొంగునట్లు ఆ చంద్రునికే కాంతి నిచ్చే ముఖచంద్రుడు గల శ్రీకృష్ణుడు నా కన్నుల ముందు నిలువగానే నా ఆశా సముద్రము ఉప్పొంగి పోతుంది.

అనువాద పద్యము

**మ: కమలోల్లాసక మై నిరంతరకళల్ గన్పట్ట శీతాంశుబిం**

**బము కంటెన్ ద్విగుణాభి రూప్యమున రమ్యంబైన నెమ్మోము యి**

**న్నమ జాబిల్లి వెలుంగుతో వెలయు కృష్ణాభిఖ్య మౌనాదు జీ**

**వము దృష్ణాబ్ధి తరంగలన్ ద్విగుణమై వర్ధిల్ల జేసెన్ మదిన్**

వ్యాఖ్య ~

కన్నయ్య నా ప్రాణం , నా జీవితం అని అంటారు. ఎంతటిసౌందర్యరాశి కృష్ణుడు ~ చంద్రునికి కూడా కాంతిని ప్రసాదించగల సౌందర్యమూర్తి. పూర్ణిమ చంద్రుణ్ణి చూస్తే సముద్రం ఉప్పొంగడము మనకు తెలుసు. ఇక్కడ ఈ నల్లని చంద్రుని చూస్తే లీలాశుక సముద్రం ఉప్పొంగిపోతుంది.

పోతనామాత్యులు ఎలా వర్ణించారో చూడండి ~

**ప: నీల జీమూత సన్నిభ శరీరము వాడు తామర సాభ నేత్రముల వాడు**

**పూర్ణేందు బింబము పోలెడు మోము వా డున్నత దీర్ఘ బాహువులవాడు**

**శ్రీవత్స లాంచనాంచిత మహోరము వాడు కౌస్తుభమణి పదకంబు వాడు**

**శ్రీకర పీత కౌశేయ చేలము వాడు మకర కుండల దీప్తి మలయువాడు**

ఈ కన్నయ్యను యదుకుల చంద్రునిగా ఎలా భావించాడో చూస్తే ఆనంద మనిపిస్తుంది.

**శ్లో: తదే తదా తామ్ర విలోచన శ్రీ సమ్భావితాశే ష వినమ్రవర్గం**

**ముహుర్ము రారేర్మధురాధ రోష్ఠం ముఖామ్బుజం చుమ్బతి మానసంమే**

భావము ~

కొంచెము ఎర్రనైన కన్నులయొక్క శోభచేత అనుగ్రహింపబడిన సమస్తమైన భక్త లోకము కలిగినదియు ఆ యీ శ్రీకృష్ణుని యొక్క తీయని మోవిగల ముఖపద్మమును నా మనస్సు మాటిమాటికిని ముద్దాడుచున్నది.

అనువాద పద్యం

**చ: కలశ పయోది శీకర నికాయముచే నునుగెంపు మీరు క**

**న్నుల నతపాళికిం బ్రియము నూల్కొన జేయుచు దత్సుధా కణం**

**బులు మధురాధ రోష్టమున బూనిన యాదిమ దేవు మోము గా**

**వలె నది గాక యున్న యెడ బల్మరు నా మది యాన గోరునే**

వ్యాఖ్య ~

స్వామి నేత్రాలు ఎర్రగా అందముగా ఉన్నాయి. వాత్సల్యగుణము వల్ల ఎరుపెక్కిన కళ్ళవి. ప్రేమారుణ నేత్రాలు అభయప్రధాన అరుణనేత్రాలు. అ కళ్ళను చూచి తమ కళ్ళు అమృతమయములయ్యాయంటారు ఈ పద్యములో శ్రీలక్ష్మణ యతీంద్రులు:

చిన్ని పాపను చూచి నా కన్ను గవయు
మూరుకొని నాస ముద్దిడి మోవి జిహ్వ
కలరవము వినివీనులు చెలగి ఎదను
ఎత్తుకొని ఎల్ల తనువును అమృతమగుత

భక్తుల మానస సరోజాలను వికసింపజేసే స్వామి రూపము ఆద్యంతమూ పద్మ సదృశమే.

కన్నయ్య బాల్యమంతా అమృతముగా ఉంటుంది ~ ఎంత చూచినా తనివి తీరదు. దృష్టి ఒకసారి చేతులమీద, ఒకసారి పాదామమీద , మరొకసారి చూపులతో పోటీ....ఇలా ఎన్నో...

**శ్లో: కరౌ శరదుదఞ్చిత్ తాంబుజ విలాస శిక్షా గురూ**
**పదౌ విభుధ పాదప ప్రధమ పల్లవోల్లంఘినౌ**
**దృశౌ దళిత దుర్మద త్రిభువనోపమాన శ్రియౌ**
**విలో కాయ విలోచనా మృత మహోచ్చైశవమ్**

భావము ~

శరత్కాల కమలములకే పాఠములు నేర్పగల చేతులును, కల్పవృక్షపు చిగుళ్ళను ఓడించు పాదములు, మూడులోకాలలోని ఉపమాన వస్తువులము ఓడించు చూపులను గలదియు కన్నులకు ఆనందములను కలిగించు నీ బాల్యమును కనుగొంటిని.

అనువాద పద్యము

**ఉ: పాదము లంటి మా విభుధ పాదప నూతన పల్లవా వళిం**
**గాదను గన్నుదోయి సరికాంతి విశేషము ముజ్జగంబులస్**
**లేదను శారదాబ్జ నవ లీలల గేల్గవ గోరు లోచనా**
**హ్లాద మయారె! శైశవ విలాసము గంటిమి నందసూతికిస్**

వ్యాఖ్య ~

~ ఒక అందాన్ని వర్ణించాలి అంటే లోకములో మనకు తెలిసిన దానిసేదైనా తీసుకుని ఇలా ఉంటుంది అని పోల్చి చెప్పడము. నిజానికి స్వామి సౌందర్యము అలౌకికము. ఈ లోకములో ఏ అందాలు స్వామితో పోల్చడానికి సరిగావు. మరి తెలిసేలా చెప్పాలి కదా అని మనకు తెలిసిన వస్తువులతో పోల్చడము లోకములో అందాలకే శిక్షా గురువులు స్వామి అందాలు.

*కన్నయ్య రూపము నిత్య నూతనమే ~ క్షణ క్షణానికీ మారి పోతూ ఉంటుంది. అందుకే గోపవనితలు పరవశులు కాక ఏమౌతారు మరి?

శ్లో: ఆచిన్వాన మహన్యహన్య హని సాకారాన్ విహార క్రమాన్
ఆరుంధాన మరుంధతే హృదయ. మద్యార్ప్రస్మి తాస్య శ్రియా
ఆ తన్వాన మనన్య జన్మ నయన శ్లా ఘ్యా మనర్ఘ్యాం దశాం
ఆ మందం వ్రజ సుందరీ స్తనతటీ సామ్రాజ్య ముజ్జృంభ తే

భావము ~ శ్రీకృష్ణుడనే పేరుకల వస్తువు అప్రాకృత. దివ్య స్వరూపము. అయినా ప్రతి దినమూ సౌలభ్య కారణముగా సకల జన మోహనములైన రూపాలను దాల్చి విలాసాలు చూపిస్తూ ఆయా క్రీడలనుబ్సాగిస్తోంది. ఆ చిరునవ్వులు ఒలకపోసే ముఖసౌందర్యము ప్రతివ్రతా శిరోమణి అయిన అరుంధతీ దేవి మనస్సుని కూడా ఒకింత వ్యాకులపరుస్తూ అస్కర్షిస్తోంది. సాక్షాత్ మన్మధుడే ఆ రూపాన్ని చూచి మాం మధ్నాతీతి ~ మన్మధః అన్నట్లు మోహపరవశుడౌతున్నాడు. గోప స్త్రీలు పరవశించి తమ చన్నులను గట్టిగా నొక్కి కౌగిలించుకొని ఆనందించే మోహ సామ్రాజ్యమది. అది నా ఎడల ఎంతగా ప్రకాశిస్తోందో...విజృంభిస్తోందో ...పొంగిపోతోందే...

అనువాద పద్యము

మ: నలినా స్థుండ్రును జొక్కిప్ కన్గొనుచు నానందించ నెమ్మోము గ్రొం
దళుకు న్నవ్వులరుంధతీ హృదయమైనం, బోవ నీ కాగ విం
తలుగా బ్రొద్దొక రూపమై మెలగు విన్నాణంబులం దేలి ని
శ్చల నంద వ్రజ సుందరీ స్తన తటీ సామ్రాజ్య ముప్పొంగెడిన్

వ్యాఖ్య ~

ఆనంద విభవ సామ్రాజ్యముగా వర్ణింపబడ్డారు నల్లనయ్య.
గోవింద ఘటయ మమ ఆనంద మమృత మిహ అని అంటారు శ్రీ నారాయణ తీర్థులు. ఆనందీ నః పునీయాత్  అని కదా సహస్రనామములో
ఆనందరూపుని ప్రార్థిస్తాము మనము.. అంత అందమా..  అంత ఆనందమా... ఔనంటారు శ్రీ లక్ష్మణ యతీంద్రులు.

నాజీవితము సర్వాతిశాయిగా ప్రకాశిస్తోందని అంటారు లీలాశుకులు. ఏమిటా జీవితము? "ప్రేమదం చ మే జీవితం  చ మే" అంటూ ఆయన ఎన్నో శ్లోకాలలో శ్రీకృష్ణునే తనవ్సర్వసముగా భావించారు కదా!

**శ్లో: సముచ్ఛ్వసుత యౌవనం  తరళ శైశవాలంకృతం**
**మద చ్ఛురిత లోచనం  మదన ముగ్ధ హాసామృతమ్**
**ప్రతి క్షణ విలోభనం ప్రణయ పీత వంశీముఖం**
**జగత్త్ర య విమోచనం  జయతి మామకం జీవితమ్**

భావము

యౌవ్వనము విజృంభించు చున్నది ~ బాల్యమింకా పూర్తిగా వీడిపోలేదు. ఆ కళ్ళు మన్మధభావాలతో నిండి అందముగా మెరసిపోతున్నాయి. చిరునవ్వు వెన్నెలలాగా ఆనందాన్ని కలిగిస్తూంది. ఆ నవ్వు అమృతమా అనిపిస్తూంది. ఎంత చూచినా ప్రతిక్షణమూ నిత్యనూతనముగానే కనిపిస్తుంది ఆ రూపము. పిల్లన గ్రోవిని ప్రేమతో  పట్టుకుని పెదవులపై ధరించి మృదువుగా నాదాన్ని నింపుతూ నా ప్రాణము ~ నా జీవితము నా కన్నయ్య సర్వోత్కృష్టుడై వెలుగొ◌ొందుతున్నాడు.

అనువాద పద్యము

**మ: తలపంతంతకు  నీటుదేరె, దళుకొందన్ జారె బాల్యంబు పె**

**న్నెల నేలెందెలినవ్వు, క్రొందళుకు లీనెన్ నేత్రముల్,  మోవికిం**

**గల వంశీముఖ చుంబనం బమరె, లోకంబుల్ విలోకించి యు**

**వ్విళు లూరెన్ మది నాదు జీవితము లీ వింబర్వే! కృష్ణా కృతిన్**

లీలాశుకుల శ్లోకానికి ఎంత బాగా అనువదించినారో ఈ పద్యములో! పోతనామాత్యులు గారు అక్రూరుని ప్రయాణములో స్వామిని తలుచుకుంటూ...

**ప:  అలక భ్రాజితమై సుధాంశు నిభమై హాస ప్రభోద్దామ మై**

**జలజాక్షంబయి కర్ణకుండల విరాజిత్ గండమై యున్న యా**

**జలజాతాక్షు ముఖంబు సూడగలుగన్ సత్యంబు వో నాకు నా**

**నల దిక్కేగుచు ఉన్నవీ వనమృగ వ్రాతంబు లీ  త్రోవలన్**

అంటూ స్వామివారి దివ్య ముఖారవిందాన్ని సేవింప చేస్తారు తమ వర్ణనలో....

**శ్లో: చిత్రం తదేతత్ చరణార విందం, చిత్రం తదేత న్నయనార విందం**

**చిత్రం తదేత ద్వదనార విందం,  చిత్రం తదేతత్ పునరంబ! చిత్రమ్**

భావము

కన్నయ్య సౌందర్యము అతృప్తామృతము ~ నిత్యనూతనము ~ చూచినకొలదీ చూడాలనిపించే ఆ సౌందర్యము అబ్బుర పరచి ఉక్కిరి బిక్కిరి చేసింది లీలాశుకులను.  ఆ పాదాలొకవింత ~ ఆ కన్నులొక వింత ~ ఆ మొగమొక వింత ~ క్షణము  క్రితము చూచిన ఆ సౌందర్యము మరో

క్షణములోనే క్రొత్త అందాల్ని సంతరించుకొని వింతగా కనిపిస్తోంది. అమ్మా! ఆహా! ఇదంతా ఎంత చిత్రముగా ఉంది!

అనువాద పద్యము

**ఉ: లోకములోన మోములు విలోచనముల్ పదముల్ సహస్ర సం**

**ఖ్యాకములంచు నెంచు శృతులా పురుషోత్తము నిర్విధంబుగా**

**నీ కను దమ్మి దోయి చెలు వీ ముఖసారస మీ పదాబ్జముల్**

**చే కొన చిత్రమంచు నుతి సేయగ బల్కరు నంబ శక్యమే**

వ్యాఖ్య

క్షణే క్షణే యన్నవతా ముపైతి ~ తదేవ రూపం రమణీయతా యాః, ఒకే రూపము ప్రతి క్షణానికి కొత్తదనాన్ని వికసింపచేయడమే రమణీయకత అంటారు. అలా స్వామి పాదాలు ~ నేత్రాలు ~ ముఖము ఎంత చూచినా నిత్యనూతన శోభలను కురిపిస్తూ ఎంతటి ఆనందాన్ని కలిగిస్తోంది అంటూ ఆ రూపసందర్శన పారవశ్యములో ఓలలాడారు లీలాశుకులు. ఆ దివ్య పాదమే ~ ఆ దివ్య నేత్రమే ~ ఆ దివ్య వదనమే ~ అంటూ పరవాసుదేవుని అందాన్ని బాలగోపాలునిలో దర్శించి విభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు. పోతనామాత్యుడు ఇలా వర్ణించాడు:

**ఈ చరణంబులే ఇందు నిభానన**

**సనకాది ముని యోగ సరళినొప్పు**

**ఈ పాదతలములే ఎలనాగ ~ శృతివధూ**

**సీమంత వీధుల చెన్ను మిగులు**

**ఈ పదాబ్జంబులే ఇభ కులోత్తమయాన**

**పాలేటి రాచూలి పట్టుకొమ్మ**

**లీ సుందరాంఘ్రులే ఇందీవరేక్షణ**

**ముక్తి కాంతా మనో మోహనములు**

**ఈ అడుగుల రజమె ఇంతి బ్రహ్మేశాది**

**దివిజ వరులు మౌళి దిశల దాల్తు**

**రనుచు కొందరబల లబ్జాక్షుడేగిన**

**క్రమము గనియు న తంక్ కానరైరి...**

సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్ అని కదా ఉంది పురుషసూక్తములో! ఆ దివ్యసౌందర్యాన్ని వర్ణించాలంటే ఈ కన్నులకు శక్తి ఎక్కడుంది? దివ్యం దదామి తే చక్షుః అని కన్నయ్య అన్నట్లు దివ్యనేత్రాలుంటే సాధ్యమేమో.....

సర్వ లోక భూషణుడు స్వామి. శృంగార పరమావధి స్వామి
గోపికా హృదయ విహారి కన్నయ్య.

**శ్లో: అఖిల భువనైక భూషణం ~ అధి భూషిత జలధి దుహితృ కుచకుంభమ్**

**వ్రజ యువతీ హారావళి ~ మరకత నాయక మహామణిం వందే**

భావము

అన్ని లోకాలకు భూషణమైనవాడు ~ లక్ష్మీదేవి చను గుండలకు అలంకారమైన వాడు ~ వలయాకారముగా నిలిచిన వ్రజయువతీ మహా హారమునకు మధ్యగల మరకత మణియైన కన్నయ్యకు నమస్కరిస్తున్నాను.

అనువాద పద్యము

**చ: జలనిధి కన్యకా ఘన కుచస్థలి పచ్చల తాళి, గోపికా**

**విలసిత హార నీలమణి ~ విశ్వ జగద్వలయ ప్రకాశ కో**

**జ్జ్వల మహనీయ రత్న మనివారిత కాళియ భోగ భోగిమం**

**డల గిరి వజ్రమై వెలయు నంద తనూజు భజింతు నా మదిన్**

వ్యాఖ్య

భువనైక భూషణుడు కన్నయ్య ~ అంతర్ భహిశ్చ తత్ సర్వం వ్యాప్య అన్నట్లు తాను నిలిచి ఉండడము చేతనే లోకాలకు అస్తిత్వము ~ అందువల్ల ఆయన కేవలము అలంకార ప్రియుడే కాదు ~ ఆత్మ స్వరూపుడు కూడా. ఆత్మ ఉంటే కదా ఏ అలంకారమైనా ప్రకాశించేది. ఆయన లక్ష్మీ వక్షస్థల విహారి. అస్తు శ్రీ స్తన కస్తూరీ వాసనా వాసితో రసే అన్నట్లు కమలాకుచ చూచుక కుంకుమతో నియతారుణి తా తులనీలతనో అన్నట్లు శృంగార రసైక మూర్తిగా కనిపిస్తాడు స్వామి ~ గోపికలతో కూడి వారంతా ఒక హారముగా భాసిస్తే, వారిమధ్య మరకతమణిగా ~ నల్లనయ్య కాబట్టీ ప్రకాశిస్తూ ~ నిలిచిన స్వామి. ఆ కన్నయ్యకు నా నమస్కారాలు అని అంటున్నారు లీలాశుకులు. అందమైనదాన్ని అన్ని కోణాలలోనూ అందముగా కనిపించి నట్లు సౌందర్య గుణాశ్రియుడైన కన్నయ్య ఎలా చూచినా సౌందర్యజలధిగా దర్శనమిస్తున్నాడు.

**శ్లో:_కాంతా కచ గ్రహణ విగ్రహ బద్ధ లక్ష్మీ**

**ఖణ్డాంగరాగ రసరంజిత మంజులశ్రీ**

**గణ్డస్థలీ ముకుర మండల ఖేలమాన**

**ఘర్మాంకురం కిమపి ఖేలతి కృష్ణ తేజః**

భావము

శృంగార సీమ అన్నారు శ్రీకృష్ణుని లీలాశుకులు ~ లక్ష్మీదేవితో సాగిన క్రీడలు~ వినోదాలు కవి మనో ఫలకముమీద స్పష్టముగా నిలిచినాయి. ప్రేయసి జుట్టు ఒడిసి పట్టే ఆలుమగల వేడుక తగవులలో లక్ష్మిని కౌగిలిలో బంధించి ఉక్కిరిబిక్కిరి చేసినందున, లక్ష్మీదేవి మైపూత స్వామి గుండెలకు అంటుకుంది. ఆ మైపూత మంజుల శోభ కలవాడును ~ అద్దములవంటి చెక్కిళ్ళయందు బొడముచున్న చెమట చుక్కలు కలదియునగు ఒకానొక నీలివెన్నెల, కృష్ణతేజము ఆటలాడుచున్నది.

అనువాద పద్యము

**మ: తళుకు న్మిద్దపు జెక్కుటద్దములపై ఘర్మాంకురంబూరగా**
**గలికాభోగ పయోధరాంతర లసత్ కాశ్మీర సంబంధ గం**
**ధిల వక్షస్థలుడై గృహీత ఘన వేణీ బంధుడై నెయ్యపుం**
**జెలియం జుంబన కేళి దేల్చు హరి నా చిత్తంబునన్ చెందెడున్**

వ్యాఖ్య

ఆది దంపతుల శృంగారము అఖిల లోకానందకరము. గజేంద్రమోకక్షములో స్వామి గజప్రాణావనోత్సాహముతో బయలుదేరినపుడు శ్రీ కుచోపరి చేలాంచలమైన వీడడు అని అంటాడు పోతనామాత్యుడు. దీన్ని కేశాకేశి (జుట్టు పట్టే ఆట) అని అంటారు. కమలాకుచ చూచుక కుంకుమతో నియతారుణితా తులనీలతనో అని అన్నారు అణ్ణన్ స్వామి. అహా! అదీ శ్రీకృష్ణ తేజము ~ నీలివెన్నెల ~ ఎంత ఆనందకరమైనది.

అన్నమయ్య స్వామి శృంగారానందాన్ని వర్ణిస్తూ సకలం హే సఖీ అనే సంకీర్తనలో ఘన కుచ శైలాగ్రస్థిత విధుమణి జననం హే సఖి జానామి అని అన్నారు.

మధురాధిపతేః అఖిలం మధురమ్ ~ ఆ దివ్య శరీరము మధురము ~ ఆ ముఖపద్మము మధురం ~ ఆ చిరునవ్వు మధురం ~ ఆ భావనే మధురం.

**శ్లో: మధురం మధురం వపు రస్యవిభోః**

**మధురం మధురం వదనం మధురం**

**మధుగంధి మృదుస్మిత మేతదహో**

**మధురం మధురం మధురం మధురం**

భావము

శ్రీకృష్ణ పరమాత్మ దేహము మిగుల మధురము ~ పూదేనె వాసనతో కూడిన చక్కని మందహాసము గల ముఖము అంతకన్నా మధురము~ ఆహా! అంతా మధురమే!

అనువాద పద్యము

**శా: చూడం జూడగ మేన దా నినుమడించుస్ మాధురీ సంపదల్**

**సూడం జూడగ మోము గోము మది మెచ్చుల్ గుల్కు ముమ్మాటికిం**

**జూడంజూడ మరంద బిందువులమించుస్ మందహాసంబు నీ**

**జూడం బల్మరు మాధురిం జెలగు నా స్వామిస్ విలోకించెదస్**

వ్యాఖ్య

మధురాష్టకము చాలా ప్రసిద్ధమైనది. అలాగే లీలాశుకులు తమ తీపి పలుకులతో స్వామిని ముంచివేశారు.

**కరణం మధురం తరణం మధురం**

**హరణం మధురం రమణం మధురం**

**పమితం మధురం శమితం మధురం**

**మధురాధిపతే రఖిలం మధురం**

పోతనామాత్యుడేమన్నారో చూద్దామా....

**రమణీ దూరము వోయె కృష్ణు రథమున్ రాదింక వీక్షింప ఈ**

**కమలాక్షున్ వొడగాన లేని దినముల్ కల్పంబులై తోచు గే**

**హములం దుండగ నేల? వోయి పరిచర్యన్ సేయుచున్ నెమ్మి నుం**

**దము రమ్మాయనెనొక్క చంద్రముఖి కందర్పాశుగ భ్రాంతమై**

స్వామి సౌందర్యాన్ని చూచి సౌందర్యాధిదేవతలే సిగ్గు పడతారట!

భక్తవత్సలుడైన శ్రీమన్నారాయణుడు ఈ జీవులను తరింపజేయడానికి ఎన్నో అవతారాలెత్తినారు ~ అందులో మానవ రూపములో ఈ లోకానికి వచ్చినవి కొన్ని. నీ ఔదార్యానికి నేను ఎలా నమస్కరించకుండా ఉండగలనయ్యా అని అంటారు లీలాశుకులు.

**శృంగార రస సర్వస్వం శిఖి పించ విభూషణమ్**

**అంగీకృత నరకారం ఆశ్రయే భువంసశ్రయమ్**

భావము

శృంగార రసమునకు సర్వస్వ భూతుడు ~ నెమలి పింఛమును ధరించినవాడును ~ లోక రక్షణార్థమూ మానవాకారమును అంగీకరించి స్వీకరించిన సచ్చిదానంద స్వరూపుడును ~ సర్వలోకాధారుడునూ అయిన శ్రీకృష్ణునికి నమస్కరిస్తాను.

అనువాద పద్యము

**ఉ: చక్కని ముద్దు వెదజల్లెడు వాని దయారసంబు చే**
**నెక్కొనివాని మౌళితటి నించిన పింఛము వాని లోకముల్**
**మ్రొక్కగ నేలువాని నతిమోహన మానుష వేషధారియై**
**యక్కర లేనివాని జగదాశ్రయునెప్పుడు నాశ్రయించెదన్**

వ్యాఖ్య

ఇచ్ఛాగృహీతాభిమతోరుదేహః అన్నట్లు మానుషవేషాన్ని స్వీకరించ వచ్చారు స్వామి వారు. వేదాంత వీధుల విహరించు విన్నాణి విహరించు కాంతార వీధులందు అని అంటారు పోతనామాత్యులు...వారి ఈ పద్య రత్నాన్ని చూడండి ఒకసారి....

**ప: శ్రీకృష్ణా యదుభూషణా నరసఖా శృంగార రత్నాకరా**
**లోకద్రోహి నరేంద్ర వంశదహనా లోకేశ్వరా, దేవతా**
**నీక బ్రాహ్మణ గోగణార్తి హరణా నిర్వాణ సంధాయకా**
**నీకున్ మ్రొక్కెద ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ**

ఆ కన్నయ్య ఈ కళ్ళకు కనిపించే భాగ్యము కలుగుతుందా? యోగవిద్యతోగానీ, ధ్యానాదులతోగానీ దర్శనీయుడు గానీ స్వామివారు ~ ఈ కళ్ళముందు ప్రత్యక్షమవుతాడా ....ఎపుడు? అని ఆర్తితో ప్రశ్నిస్తున్నారు....

**శ్లో: నా ద్యాపి పశ్యతి కదాచన దర్శనేన**

**చిత్తేన చోపనిషాద సుదృశాం సహస్రమ్**

**సత్వం చిరం నయనయో రనయోః పదవ్యాం**

**స్వామిస్ కదాను కృపయా మమ సన్నిధత్సే**

భావము

కన్నయ్యా! యోగులనేకులు నిన్ను దర్శించాలని చిరప్రయత్నాలు చేసి ప్రత్యక్షముగా గానీ, ధ్యానముతో గానీ, ఉపనిషద్విచారముచేగానీ ~ ఇప్పటికీ నిన్ను చూడలేకపోతున్నారు. వాక్ ~ మనస్సులకు గోచరింపని మహిమాన్వితుడవయిన నీవు ప్రాకృతములైన ఈ నా చర్మచక్షువులకు అపారమైన దయతో ఎపుడు దర్శనమిస్తావో కదా!

అనువాద పద్యము

**కొందరు యోగదృష్టి నొక కొందరు వేద విచార వాసనం**

**గందురు నిన్ను నెప్పుడో యొకానొక వేళ నభిజ్ఞులైన వా**

**రందరు నిట్టి నీవు కరుణాంభుధి! ప్రాకృత దృష్టి జెందు నా**

**ముందట నిల్చి యెన్నడు ప్రమోదమొనర్తువు నందనందనా!**

వ్యాఖ్య

న చమాం శక్యసే ద్రష్టుమ్ అనే నైవ స్వచక్షుషా అని అన్నారు కదా స్వామి! ఈ చర్మనేత్రాలతో వీలుకాదు కదా! ఈ చర్మనేత్రాలకు కనిపిస్తే ఇంకేముంది ~ ఎంత ఆనందమో! నయనపథగామీ భవతుమే...అన్నట్లు అలా కనిపిస్తే జీవితాన్ని పండించిన ఆనందమే కదా! స్వామిని వేదాలే వర్ణించలేకపోయాయి కదా!

కఠోపనిషత్తులో ... నాయామాత్మా ప్రవచనేన లభ్యః

ఇలా ఉంది. న మేధయా న బహునా శ్రుతేన

యమేవైష వృణుతే తేన లభ్యః

తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వాం

స్వామి దివ్య చక్షువులనిస్తేనే కదా అర్జునుడు ~ ధృతరాష్ట్రుడు చూడగలిగినారు!

శ్రీకృష్ణుని తలచుకుంటే చాలు నమస్కరించాలని చేతులు రెండూ దగ్గరవుతాయి. ఎంతో ఆనందమవుతుంది.

**శ్లో: కేయం కాన్తిః కేశవ! త్వన్ముఖేన్దోః**

**కోయం వేషః కోపి వాచామభూమిః**

**సేయం సోయం స్వాదుతామంజుల శ్రీః**

**భూయో భూయో భూయశస్త్వాం నమామి**

భావము

ఓ శ్రీకృష్ణా! ఆహా! నీ ముఖ కాంతి ఎంత గొప్పది! నీ రూపమెంత అందమైనది! పలుకులకందని అపురూపమైన ఈ వేషమెంత గొప్పది! ఇంత గొప్ప వాడవైన నీకు మళ్ళా మళ్ళా పలుసార్లు నమస్కరిస్తున్నాను.

అనువాద పద్యము

**ఎక్కడి గోపరూపమది? యెక్కడి ముద్దు ముగంబునోయగం**
**బెక్కడ నీ కళావిభవ మెక్కడ నేమని యెన్నవచ్చు న**
**మ్మక్క! య గోచరంబు భవదాకృతి పద్మ భవాది సూక్తికిన్**
**మ్రొక్కెద సారె సారెకు 'నమో హరయే' అని నంద నందనా!**

వ్యాఖ్య

నమ పురస్తాత్ అధ పృష్టతస్తే అని అర్జునుడు అన్నట్లు ఎన్ని సార్లు నమస్కరిస్తే తృప్తి అనిపిస్తుంది! ఇంత అందమా అని మనసు అధ్భుతానందాల సంద్రములో ఓలలాడుతుంది. తృప్తిని కలిగించని అతృప్తామృతమది! ఆ అందమెంత బాగుందంటే భీష్మాచార్యులు ఎలా వర్ణించినారో పోతన పద్యరత్నమొకటి వారి శ్రీమద్భాగవతములోనిది చూద్దామా!

**త్రిజగన్ మోహన నీలకాంతి తనువుద్దీపింప ప్రాభాత నీ**
**రాజ బంధు ప్రభమైన చేలము పయిన్ రంజిల్ల ~ నీలాలక**
**వ్రజ సంయుక్త ముఖారవింద మతి సేవ్యంబై విజృంభింప మా**
**విజయుం జేరెడు వన్నెకాడు మదినావేశించు నెల్లప్పుడున్**

**శ్లో: తత్ త్వన్ముఖం కథ మివాబ్జ సమాన కక్షం**
**వాఙ్మాధురీ బహుళ సర్వకళా సమృద్ధమ్**
**తత్ కిం బ్రువే కిమపరం భువనైక కాంతం**
**యస్య త్వదానన సమా సుషమా సదాస్యాత్**

భావము

కృష్ణా! సర్వదా కళాపూర్ణమైనది నీ ముఖము ~ ఆ చంద్రుడో కృష్ణపక్షములో స్రుక్కిపోవును కదా! అటువంటి చంద్రునితోనా నీ ముఖమునకు కాంతిలో పోలిక? పోనీ నీ ముఖమువలె సర్వకాల సర్వావస్తలలోనూ గొప్ప కాంతిగలదై మనోజ్ఞముగా ఉండే వస్తువు ఈ సృష్టిలో ఏది ఉందని తెచ్చి నీ ముఖ కాంతితో పోల్చి చెప్పగలను? అటువంటి వస్తువు ఈ సృష్టిలోనే లేదు గదా! ఏమి చెప్పుదును?

అనువాద పద్యము

**సరసి జమంటిమా తగదు సాటికి శారదపూర్ణిమ సుధా**
**కర రుచి యంటిమా, సమముగాదిక వేరె జగంబునన్ ~ మనో**
**హర మగు వస్తు వొండొకటి యారసిచూడ నొకానొకప్పుడుం**
**బురుడు ఘటిల్లునే భువనమోహన! నీ ముఖకాంత కాంతికిన్**

వ్యాఖ్య

న త్వత్ సమః న అధికః అన్నట్లు సములైన వారే లేనిచోట అధికులైనవారెక్కడ దొరుకుతారు? రామా నీ సమానమెవరు అని అన్నారు త్యాగయ్య గారు.

సురుచిర బహువిధ కౌసుమ ~ పరాగ పరిలిప్త మత్త బంభరయుగ సుం
దరతయు నునుబుగ్గల ముం ~ దర దుగదిడుపంటె చూచి తనియుట యున్నే
~~ అని అన్నారు లక్ష్మణ యతీంద్రులు ~ నీ నున్నని బుగ్గలనెంతసేపు
చూస్తే తృప్తి కలుగుతుంది చెప్పు అని అంటారు.

**శ్లో: వదనేందు వినిర్జిత శ్శశీ ~ దశధా దేవ! పదం ప్రపద్యతే**

**అధికాం శ్రియ మశ్నుతే తరాం ~ తవ కారుణ్య విజృంభితం కియత్**

భావము

శ్రీకృష్ణా! చంద్రుడు నీ ముఖ చ్ఛంద్రుని కాంతిచేత ఓడింపబడి పదిముక్కలై నీ పాదములను ఆశ్రయించినాడు. అప్పటినుండీ నిరుపమాన సౌభాగ్యమును పొందుచున్నాడు! ఆహా! దీనులయెడ నీ దయా విశేషమును ఎంతని చెప్పవచ్చును.

అనువాద పద్యము

**ఆనన కాంతితోడ నెదురాని శంశాకుడు నిల్వలేక నీ**
**మానిత పాదపద్మముల మాటున జేరి నఖాంకురాకృతిం**
**బూని భజించినంతనె సమున్నత శ్రీ లొనగూర్చి తేర నీ**
**దీన దయా పర్వతము నుతింపగ శక్యమె నందనందనా!**

వ్యాఖ్య

లోకములో సాధారణముగా ఓడిపోయినవారు ~ జయించినవారి పాదములపై బడి క్షమించమని ప్రార్థిస్తారు. శ్రీకృష్ణుడి ముఖ కాంతి ముందు చంద్రుడు ఓడిపోయాడు. అంటే కన్నయ్య ముఖకాంతిచే ఓడించబడిన చంద్రుడు పది ముక్కలై పాదాలమీదపడి ఆశ్రయించినాడు ~ అంటే ~ ఆ పదిగోళ్ళూ కూడా అంత అందముగా ఉన్నాయన్నమాట! ఏదో కాళ్ళమీదపడి బ్రతుకుతున్నామని కాకుండా అలా పాదాలమీద పడ్డాక మరింత శోభను పొంది

ప్రకాశిస్తున్నాయట! తనను ఆశ్రయించినవారిని అంత దయతో కాపాడుతాడన్న మాట!

కదిర్ మదియంబోల్ ముగత్తాన్ అని అన్నది మన ఆండాల్ తల్లి! ఇక పోతనామాత్యుడు ఏమన్నాడో చూద్దామా!

**ప: ఏ విభు వందనార్చనము లేవిభు చింతయుల నామకీర్తనం**
**బే విభు లీల లధ్భుతము లెప్పుడు సంశ్రవణంబు సేయ దో**
**షావలి బాసి లోకము శుభాయత వృత్తి చెలంగునండ్రుసే**
**నా విభు నాశ్రయించెద అఘౌషు నివర్తను భద్రకెర్తనుస్**

చేతులు వేళ్ళా ఆ గోళ్ళా ఎలా ఉన్నాయంటే పద్మపు రేకులమీద ముత్యాలలా ఉన్నాయట! సర్వపాపాలను పోగొట్ట గలిగిన విభుడు కన్నయ్య స్వామి వారు ~ అందుకే అయనని ఆశ్రయించాలని అన్నారు శుకమహర్షి భాగవతములో!

**శ్లో: తత్ త్వన్ముఖం కథ మివాబ్జ సమాన కక్షం**
**వాఙ్మాధురీ బహుళ సర్వకళా సమృద్ధమ్**
**తత్ కిం బ్రువే కిమపరం భువనైక కాంతం**
**యస్య త్వదానన సమా సుషమా సదాస్యాత్**

భావము

కృష్ణా! సర్వదా కళాపూర్ణమైనది నీ ముఖము ~ ఆ చంద్రుడో కృష్ణపక్షములో స్రుక్కిపోవును కదా! అటువంటి చంద్రునితోనా నీ ముఖమునకు కాంతిలో పోలిక? పోనీ నీ ముఖమువలె సర్వకాల

సర్వావస్తులలోనూ గొప్ప కాంతిగలదై మనోజ్ఞముగా ఉండే వస్తువు ఈ సృష్టిలో ఏది ఉందని తెచ్చి నీ ముఖ కాంతితో పోల్చి చెప్పగలను? అటువంటి వస్తువు ఈ సృష్టిలోనే లేదు గదా! ఏమి చెప్పుదును?

అనువాద పద్యము

**సరసి జమంటిమా తగదు సాటికి శారదపూర్ణిమ సుధా**

**కర రుచి యంటిమా, సమముగాదిక వేరె జగంబునన్ ~ మనో**

**హర మగు వస్తు వొండొకటి యారసిచూడ నొకానొకప్పుడుం**

**బురుడు ఘటిల్లునే భువనమోహన! నీ ముఖకాంత కాంతికిన్**

వ్యాఖ్య

న త్వత్ సమః న అధికః అన్నట్లు సములైన వారే లేనిచోట అధికులైనవారెక్కడ దొరుకుతారు? రామా నీ సమానమెవరు అని అన్నారు త్యాగయ్య గారు.

సురుచిర బహువిధ కౌసుమ ~ పరాగ పరిలిప్త మత్త బంభరయుగ సుం

దరతయు నునుబుగ్గల ముం ~ దర దుగదిడుపంటె చూచి తనియుట యున్నే

~~ అని అన్నారు లక్ష్మణ యతీంద్రులు ~ నీ నున్నని బుగ్గలనెంతసేపు చూస్తే తృప్తి కలుగుతుంది చెప్పు అని అంటారు.

**శ్లో: శుశ్రూషసే యది వచః శృణు మామకీనం**

**పూర్వైరపూర్వ కవిభిః న కటాక్షితం యత్**

**నీరాజన క్రమధురం భవదాననేందోః**

**నిర్వ్యాజ దుర్గతి చిరాయ శశిప్రదీపః**

భావము ~

శ్రీకృష్ణా! ఈ చంద్రుడు అను దీపము నీ ముఖము చుట్టును దృష్టిదోష పరిహారర్థము త్రిప్పుటకు తగిన దీపమై ఉన్నది అంతే ~ ఇందులో అసత్యమేమాత్రమూ లేదు. పూర్వ కవులెందరో విశేష కవితా చమకృతి కలవారే కానీ వారెవ్వరునూ ఈ విషయాన్ని చెప్పలేదు.

అనువాద పద్యము

**చ: తొలు తటి వ్యాస ముఖ్య కవిధుర్యులు పల్కని సాహసంబునే**
**బలికెద వింటివేని విను పంకజలోచన! నీదు మోముతో**
**గలివల రేని సాటియనగా దగ దారతి పళ్ళెరంబు లో**
**పల నిడి దివ్వెగా నతని బట్టి నివాళి యొనర్పగాదగున్**

వ్యాఖ్య ~

నరుని కళ్ళకు నల్లరాయి కూడా పగులుతుంది అని సామెత... అందుకే దిష్టి తీయడమనే మాట వచ్చింది. యశోదమ్మ గామయాన్ని దృష్టిదోష పరిహారార్థమూ చుట్టూ తిప్పి వేసేదట! మన లీలాశుకులు చంద్రుణ్ణి ఒక పళ్ళెములో పెట్టి దీపముగాచేసి మన కన్నయ్య చుట్టూ తిప్పి పడేయాలట. ఈ నల్లనయ్యకు ఆ తెల్లని చంద్రయ్య ఉపయోగపడాలట!

పోతనామత్యులు ~ ఇలా అంత అందగానిని ~ అపరిమితుని ~ అఘ నివారణార్థం కొలుస్తున్నారు అని అన్నారు ఈ పద్యకుసుమములో:

**ప: తపముల చేసి యైన మరి దానములెన్నియు చేసియైన ఏ**

**జపముల చేసియైన మరి దానములెన్నియు చేర్చకున్న హే**

**య పదములై దురంత విప దంచితరీతిగ నొప్పుచుండు న**

**య్య పరిమితుస్ భజించెద నఘౌఘ నివర్తను భద్ర కీర్తనుస్**

అమృత సముద్రాలొలికించే అందాల చిరునవ్వులు సమ్మోహన పరుస్తూంటే లీలాశుకుల భావాలు జాలువారిన శ్లోకమిది!

**అఖండ నిర్వాణ రస ప్రవాహైః ~ విఖండితాశేష రసాంతరాణి**

**అయం త్రితో ద్వాన్త సుధార్ణవాని ~ జయంతి శీతాని తవస్మితాని**

భావము

శ్రీకృష్ణా! ఎడతెగని ఆనంద రస ప్రవాహముచే ఇతర దేవతలు రసములన్నింటినీ ధిక్కరించి, లెక్కింపలేనంతగా నిరాటంకముగా అమృత సముద్రములను గ్రుమ్మరించు నీ చల్లని చిరునవ్వులు సర్వోత్కర్షములై వెలయుచున్నవి.

అనువాద పద్యము

**మ: కవితానంద మహాను భావమున వేడ్కల జెంది యంతంతకుం**

**దెలియం బొంగుసుధా తరంగిత పయోధిస్ లీల గన్పించుచుస్**

**దళితాశేష రసాంతరంబులగు లేనవ్వుల్ మిటారింప గో**

**కుల కాంతాజన లోగభాగ్య మహిమాంకురంబు సెల్వొందెడిస్**

వ్యాఖ్య

లోకములో నవరసాలున్నాయంటారు ~ కానీ ఆ రసాలన్నింటినీ ధిక్కరించి ఏకైక రసంగా మిగిలినది ఆనందరసమేనట! ఆ చిరునవ్వులు అమృతాన్ని చిందిస్తున్నాయట! ఎంత ఆనందమది! ~ అమృత సముద్రాన్నే కురిపించే ఆనందాల మేఘమట! నగుమోము గనలేని నా మనోహరుని అన్నట్లు మోముకు చిరునవ్వే పెట్టని ఆభరణము...

పోతనామాత్యులు స్వామి రూపాన్ని దర్శించిన భావములో చూడండి...

**వీర కిరీట కేయూర కంకణఘన ~ భూషణుండాశ్రిత పోషకుండు**

**లాలిత కాంచీకలాప శోభిత కటి ~ మండలుండంచిత కుండలుండు**

**మహనీయ కౌస్తుభమణి ఘృణి చారు గ్రై**

**వేయకుండానంద దాయకుండే**

**సలలితఘన శంఖ చక్ర గదా**

**పద్మహస్తుండు భువన ప్రశస్తుడజుడు**

**కమ్ర సౌరభ వనమాలికాదరుండు**

**హత విమోహుండు నవ్యపీతాంబరుండు**

**లలిత కాంచన నూపురా లంకృతుండు**

**నిరతిశయ సద్గుణుడు దర్శనీయతముడు**

నందుడు నిద్రపోయే కన్నయ్యని చూచి దగ్గరగా వచ్చి దుప్పటి తీస్తే

చీకట్లన్నీ ఒక్కసారి పారిపోయినట్లుగా అనిపించిందట! పాలనురుగు అలా అలా పక్కకు జరిగి చంద్ర దర్శనమయినట్లు అనుభూతు శరీరస్మృతి లేదట ఆనంద క్షీరసాగరములో శ్రీకృష్ణ దర్శనము!

అందమంటే నువ్వే .... రాముడు మూర్తీభవించిన ధర్మమన్నట్లు, నీవు ఆకృతి దాల్చిన అందానివి...సృష్టిలో ఇంకెక్కడా ఇంత అందమే లేదు తండ్రీ!

**కామం సంతు సహస్రశః కతిపయే సారస్య ధౌరేయకాః**

**కామం వా కమనీయతా పరిణతి స్వారాజ్య బద్ధ వ్రతా**

**తై ర్నైవం వివదామహే నచవయం దేవ! ప్రియం బ్రూమహే**

**యత్ సత్యంయ మణీయతా పరుణతిః త్వయ్యేవ పారంగతా**

భావము

శ్రీకృష్ణా! లోకములో అనేకులు రసికులుందురు గాక! ఆ విషయములో మాకు ఏమీ సందేహము లేనే లేదు. మాకు ముఖప్రీతిగా మట్లాడుట తెలుయదు. నిజమే చెప్పుట అలవాటు గలవారము ~ నీ అందము నీ ఒక్కని యందే గానీ వేరెక్కడనూ లేదు.

అనువాద పద్యము

**ఉ: లోకము లోపలన్ రసిక లోకమనేకము గల్గుగాక**

**య స్తోక మనోహరావయవ శోభితులుందురు గాక వారితో**

**నే కలహింపనేల మొగమిచ్చకమేటికి సత్యమాడెదన్**

**నీ కమనీయతా మహిమ నీకతగున్ మరి కానమెయ్యడన్**

వ్యాఖ్య

అందము ~ రసికత్వము రెండూ చాలా విశేషమైన, విలక్షణమైన, అరుదైన గుణాలు. అందానికి ఎంతటివాడైనా దాసోమనక తప్పదు. ప్రపంచాన్ని వశము చేసుకొనగలిగిన గుణాలివి. ఇవి చాలామందికి ఉండవచ్చు. కానీ ఎన్నాసైనా ఉండనీ, ఒక సత్యాన్ని చెప్పితీరాలి ~ ఇది పొగడ్తో, లేదో ఇచ్చకపు మాటో మాత్రము కానేకాదు. అలా చెప్పే అలవాటు మాకు లేదు. కన్నయ్యను మించిన శృంగార రస చక్రవర్తి ఈ సృష్టిలో లేనే లేదు ~ ఇది సత్యం సత్యం సత్యం. ముమ్మాటికీ ఇది సత్యం.

కన్నయ్య మదనాభిరాముడు ~ కల్పవృక్ష మూలములో నిలిచి శృతి సుభగముగా వేణుగానాన్ని చేస్తున్నాడు ~ గోపీజన మధ్యస్తుడైన గోకుల పూర్ణ చంద్రుడు స్వామి. లీలాశుకులంటారు ఇలా....

మందారమూలే మదనాభిరామమ్ ~ బింబాధరాపూరిత వేణునాదమ్
గో గోప గోపీ జన మధ్య సంస్థం ~ గోపం భజే గోకుల పూర్ణచంద్రమ్

భావము

మందార వృక్షము క్రింద మదనాభిరాముడై నిలిచి పిల్లనగ్రోవిని పెదవిని చేర్చి మధురముగా వాయిస్తూ, ఆవుల మధ్య గోపకులతోడను, గోప స్త్రీల తోడనూ తిరుగుచూ వ్రేపల్లె వారికి చంద్రునివలె ఆనందకరుడైన శ్రీకృష్ణుని సేవిస్తాను.

అనువాద పద్యము

**ఉ: గోపిక గోపికల్ సడలి కొల్వగ గోపులు గోపులాడగా**
**గ్రేపులు మేపులాని పరికింపగ గెంజికురాకు మోవిపై**
**మోపిన వేణువగ్గలము మ్రోయగ గల్పవనిస్ వసించు గా**
**గోపకుమార మన్మధుని గోకులవార్ధి శశిస్ భజించెదస్**

వ్యాఖ్య

కన్నయ్య అర్ధిజన మందారుడు ~ అందుకే మందారవృక్ష మూలములో నిలిచాడు ~ ఆ నిలిచిన భంగిమ ఎంత అందముగావుంది! మన్మధుడు కన్నయ్య ముందు ఎక్కడ నిలబడగలడు? మన్మధునికూడా కదిలించే సౌందర్యము! ఆ త్రిభంగి రూపములో వేణువును పెదవిపై ఆన్చి మధురనాదాన్ని పూరిస్తే శ్రోతల మనః పద్మాలు అలా అలా వికసించి ఆనందసౌరభాకు వెదజల్లుతాయట! గోవులు మేతమాని గోపికలు సర్వమూ మరచి గోపాలురు అన్ని పనులు మాని కన్నయ్య చ్చుట్టూ చేరేవారట! గోకులానికే ఆనందాన్నిచ్చే పూర్ణచంద్రుడాయన! ఆహ్లాదాన్నిచ్చే ఆ కన్నయ్య స్వామికి నమస్కారము అని అంటారు లీలాశుకులు. శ్రీకృష్ణ స్థుతిపరమైన శ్లోకాలలో జగత్ప్రసిద్ది పొందిన శ్లోకమిది. ఒక చక్కని చ్చిత్రాన్ని వేయడానికి, రూపకల్పన చేయడానికి, అక్షరాలు చిత్రాకృతి దాల్చడానికి ఎంతో అనుకూలమైన శ్లోకమిది. శ్రీకృష్ణ భక్తుల హృదయారవిందాలను వికసింపచేసే శ్లోకము.

**~(సేకరణ: పి. యల్. నరసింహాచార్య దాసస్)~**